డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ, మత్స్యకార
మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి - 01 సంచిక - 12 జూన్ 2021 పేజీలు - 44



## పంటలకు బీమా.. రైతన్నలకు ధీమా

### 15.15 లక్షల మంది రైతులకు ₹ 1,820.23 కోట్ల లబ్ధి

## ₹ 31 వేల కోట్లతో రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్

డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా.. కర్షకుడి కులాసా.. :




52.38 లక్షల కుటుంబాలకు 3,928.88 కోట్ల లబ్ధి






ప్రధాన సంపాదకులు
**శ్రీ హెచ్. అరుణ్‌కుమార్,** ఐ.ఏ.ఎస్.
వ్యవసాయ కమీషనర్



సంపాదకులు
**శ్రీమతి డి. ప్రమీల**
డైరెక్టర్, ఆత్మ

అదనపు సంపాదకులు
**శ్రీ వి. శ్రీధర్**
సంయుక్త వ్యవసాయ సంచాలకులు, (ఆర్.బి.కే.)

సహాయ సంపాదకులు
**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** డిడిఎ ఇన్‌చార్జ్
**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ
**శ్రీ కె.వి.జి.కె. వరప్రసాద్,** ఎఒ

*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com

## విషయసూచిక

సంపాదకీయం


| | | |
|---|---|---|
| 1. | అన్నదాత అభ్యున్నతికి పెద్ద పీట | 5 |
| 2. | నిరంతరం రైతన్నకి వెన్నంటి.... | 6 |
| 3. | కష్టకాలంలోనూ కర్షకులకు సాయం | 7 |
| 4. | గంగ పుత్రులకు అండ | 9 |
| 5. | రైతు విత్తనం రైతుకే | 10 |
| 6. | ధాన్యం రైతు 'ధర' హాసం | 11 |
| 7. | పచ్చిరొట్ట ఎరువులు పంటల అవశేషాలతో భూసార అభివృద్ధి | 12 |
| 8. | సాయిల్ హెల్త్ కార్డ్ – సూక్ష్మ పోషక ఫలితాల విశ్లేషణ | 14 |
| 9. | మెట్ట సాగులో దుక్కి దున్నే యంత్రాలు | 16 |
| 10. | నేటి వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత | 18 |
| 11. | వేరుశనగలో సరైన మొక్కల సాంద్రత పాటించాలి | 20 |
| 12. | చిత్ర మాలిక | 22 |
| 13. | ఖరీఫ్ కంది సాగులో అధిక దిగుబడులకు యాజమాన్య పద్ధతులు | 24 |
| 14. | పసుపు సాగులో కీలక యాజమాన్య పద్ధతులు | 26 |
| 15. | వర్షాకాలంలో కోకో తోటలలో మేలైన యాజమాన్య పద్ధతులు | 28 |
| 16. | ఖరీఫ్ కూరగాయల సాగుకు సూచనలు | 30 |
| 17. | కౌజు పిట్టల పెంపకం – లాభదాయకం | 32 |
| 18. | మంచినీటి (స్కాంపి) రొయ్యల పెంపకం | 34 |
| 19. | టూకీగా... | 36 |
| 20. | సందేహాలు – సమాధానాలు | 37 |
| 21. | సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు – సమాధానాలు | 39 |
| 22. | సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| 23. | సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |



డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా – రూ.300/–
పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు




## సంపాదకీయం

# రైతు సంక్షేమానికే అగ్రతాంబూలం

కరోనా ఆపత్కాలంలోనూ, లాక్‌డౌన్ ఆంక్షల్లోనూ, కర్ఫ్యూ కట్టడిలోనూ దేశ మనుగడకోసం, నిరంతరం శ్రమించే అన్నదాతల సంక్షేమానికి అగ్రప్రాధాన్యం ఇవ్వడమే తన విధానమని ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి గారు నిరూపించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలపై పెట్టే పెట్టుబడినే ఆకలి, పేదరికంపై పోరాటానికి ఆయుధంగా భావిస్తూ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. అందుకు ప్రబలనిదర్శనం ఈ 2021-22 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.31,256.36 కోట్లతో ప్రవేశపెట్టిన వ్యవసాయబడ్జెట్. అంతేకాదు వరుసగా రెండోఏడాది కరోనా మహమ్మారి విజృంభిస్తున్నా రైతుల అభ్యున్నతికి, వ్యవసాయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అగ్రతాంబూలం ఇచ్చింది. ఈసారి వ్యవసాయ బడ్జెట్లో గత ఏడాది కంటే అధికంగా రూ. 2,096.36 కోట్లు అధికంగా నిధులు కేటాయించడమే అందుకు ఉదాహరణ. కరోనా దెబ్బకు ప్రపంచం అతలాకుతలం అయింది, వ్యవసాయ రంగం కుదేలైంది. దేశం మొత్తం మీద ఇదే పరిస్థితి నెలకొంది. కానీ మనరాష్ట్రంలో ముఖ్యమంత్రి వర్యుల దూరదృష్టి వల్ల ప్రభుత్వం అండతో వ్యవసాయరంగం విపత్కర పరిస్థితులను తట్టుకుని నిలబడగలిగింది. గత రెండేళ్లలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.83 వేల కోట్లను ఖర్చుచేసింది. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి నిధులు కేటాయించడం ముఖ్యమంత్రి దార్శనికతకు నిదర్శనం.

గత ఏడాదితో పోల్చుకుంటే వ్యవసాయ, పశుసంవర్ధక సహకార పట్టుపరిశ్రమల శాఖలకు కేటాయింపులు భారీగా పెంచడం ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలకు నూతన జవసత్వాలిచ్చారు. ఫామ్ గేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్రింద ప్రతి గ్రామంలో మౌళిక వసతుల కల్పనకు సుమారు రూ. 14000 కోట్లతో ప్రణాళిక రూపొందించారు.

అధికారంలోకి వచ్చిన 24 నెలల్లోనే ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి గారి ప్రభుత్వం రైతులకు రూ.83 వేల కోట్ల మేర సహాయం అందించడం దేశంలోనే ఒక సువర్ణ అధ్యాయం. ఇందులో గత సర్కారు మిగిల్చిన బకాయిలు రూ 2,771 కోట్లు కూడా చెల్లించింది.

దేశంలో రైతులపై ఒక్క రూపాయి కూడా బీమా ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

ఏ సీజన్లో పంట నష్టం జరిగితే అదే సీజన్లో పరిహారం చెల్లించే విధానాన్ని దేశంలో తొలిసారిగా మనరాష్ట్రంలోనే ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలుచేస్తున్న ఘనత మన ముఖ్యమంత్రిది. గత ఏడాది లాక్‌డౌన్ పరిస్థితుల్లోనూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మన రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదరాభిమానాలు చూరగొంది. ఇందుకోసం ముఖ్యమంత్రి రూ.3 వేల కోట్లతో ధరలస్థిరీకరణనిధిని ఏర్పాటుచేశారు. 2019 నుంచి 2021 మే వరకు రూ.31, 782 కోట్లతో 157 లక్షల టన్నుల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుచేశారు.

ఇలా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం రైతు సంక్షేమానికి నిర్విరామ కృషి చేస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మేలో రైతు భరోసాకింద రూ. 3,900 కోట్లకుపైగా ఇస్తే, 15.15 లక్షల మంది రైతులకు మేలు జరిగేలా మరో 1,820 కోట్లు వై.ఎస్.ఆర్. ఉచిత పంటల బీమా సాయం కింద ఇచ్చి రైతు బిడ్డనని ముఖ్యమంత్రి రుజువు చేసుకున్నారు.

# అన్నదాత అభ్యున్నతికి పెద్ద పీట

## 24 నెలల్లో రైతులకు రూ. 83 వేల కోట్ల లబ్ధి

వరుసగా రెండో ఏడాదీ కరోనా మహమ్మారి అన్ని రంగాలను అతలాకుతలం చేస్తోంది. కరోనా సెకండ్ వేవ్ కారణంగా ఆర్థిక వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉంది. అయినాసరే.. ఈ కష్టకాలంలో అన్నదాతకు అండగా నిలవాలని ప్రభుత్వం సంకల్పించింది. గతేడాదికన్నా మిన్నగా కేటాయింపులు జరపడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్టును ప్రకటించడమే కాకుండా.. వరుసగా మూడో బడ్జెట్లోనూ ఈ రంగానికి పెద్దపీట వేస్తూ కేటాయింపులు చేసింది. 2019-20 లో రూ. 28,866 కోట్లతో తొలి వ్యవసాయ బడ్జెట్టును ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం 2020-21లో కేటాయింపులను రూ. 29,159.97 కోట్లకు పెంచింది. ఈ ఏడాది ఏకంగా రూ. 31,256.35 కోట్లు కేటాయించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ. 2,096.38 కోట్లను అదనంగా బడ్జెట్లో కేటాయింపులు జరిపింది. గతేడాదితో పోల్చుకుంటే వ్యవసాయ, పశుసంవర్ధక, సహకార, పట్టు పరిశ్రమల శాఖలకు కేటాయింపులు భారీగా పెంచడం ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలకూ నూతన జవసత్వాల నిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి శ్రీ కన్నబాబు ప్రవేశపెట్టారు.

### అన్నదాతలకుఅగ్రతాంబూలం

వై.ఎస్.ఆర్. రైతుభరోసా పీఎం కిసాన్ పథకం కింద గతేడాది 51.95 లక్షల రైతు కుటుంబాలకు రూ . 6,928 కోట్లు పంపిణీ చేయగా. ఈ ఏడాది ఈ పథకానికి రూ. 6,976.50 కోట్లు కేటాయించింది. ఇప్పటికే మొదటి విడతగా ఈ నెల 13వ తేదీన 52.88 లక్షల రైతు కుటుంబాలకు రూ. 3,928.88 కోట్లు జమచేసింది. శ్రీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఇప్పటి వరకు రూ. 17,029.88 కోట్లను రైతులకు పెట్టుబడి సాయంగా అందించారు. వ్యవసాయ సబ్సిడీ కోసం టీడీపీ సర్కారు 2018-19లో రూ. 2,138.22 కోట్లు ఖర్చు చేస్తే గతేడాది రూ. 4,450 కోట్లు కేటాయించిన శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారి ప్రభుత్వం ఈ ఏడాది ఆ మొత్తాన్ని రూ. 5 వేల కోట్లకు పెంచింది.

### ఉపాధి హామీతో అనుసంధానం..

వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానించాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా గతేడాది కంటే మిన్నగా ఈ ఏడాది కేటాయింపులు జరిపారు. గతేడాది వ్యవసాయరంగంలో ఉపాధిహామీ పథకం కింద రూ. 6,270 కోట్లు కేటాయిస్తే.. ఈ ఏడాది ఏకంగా రూ. 8,116.16 కోట్లు కేటాయించారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం గతేడాది 207.83 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది ఆర్బీకేలకు అనుసంధానంగా కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా యంత్ర సేవాకేంద్రాలు ఏర్పాటు కోసం రూ. 739.46 కోట్ల కేటాయింపులు పెంచారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమాపథకం కింద గత బడ్జెట్లో రూ. 500 కోట్లు కేటాయిస్తే.. ఈ ఏడాది మూడున్నర రెట్లు పెంచారు. ప్రస్తుత బడ్జెట్లో ఏకంగా రూ. 1,802.82 కోట్లు కేటాయించారు.

### మత్స్య, పశుసంవర్ధకశాఖలకూభారీగా..

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో పశు సంవర్ధక, మత్స్యశాఖలకు గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భారీగా కేటాయింపులు జరిపారు. గతేడాది పశుసంవర్ధక శాఖకు రూ. 854.78 కోట్లు కేటాయిస్తే.. ఈ ఏడాది రూ. 1,026.37 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే 171.59 కోట్లను అదనంగా కేటాయించారు. మత్స్యశాఖకు గతేడాది రూ. 299 కోట్లు కేటాయిస్తే.. ఈ ఏడాది రూ. 329.48 కోట్లు కేటాయించారు. పశు నష్టపరిహారం, రాజన్న పశువైద్యం, పశువిజ్ఞాన బడివంటిపథకాలకు కేటాయింపులు జరిపింది. పాల ఉత్పత్తి సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేటాయింపులు పెంచింది. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న సహకారశాఖకు గత బడ్జెట్లో రూ. 248.38 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ. 303.04 కోట్లకు పెంచారు.



"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# పంటల బీమాతో నిరంతరం రైతన్నల వెన్నంటి

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గట్టిగా నమ్మి, అడుగులు వేశాం. ఇవాళ రాష్ట్రంలో దాదాపు 62 శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. తద్వారా మనకు ఆహారభద్రత, ఉపాధి కలుగుతోంది. ఈ ఏడాది కూడా చక్కగా వర్షాలు కురిసి, రైతన్నలకు మంచి పంటలు పండాలని మీ బిడ్డగా కోరుకుంటున్నా.

ఈ నెలలో రైతుల కోసం మొన్న రైతుభరోసా కింద రూ. 3,900 కోట్లకు పైగా ఇస్తే, 15.15 లక్షల మంది రైతులకు మేలు జరిగేలా మరో రూ. 1,820 కోట్లు ఇస్తున్నాం. ఆ విధంగా రూ. 5,748 కోట్ల సహాయం చేశాం. ఇలా రైతులకు మేలు చేసే అవకాశం దేవుడు నాకిచ్చినందుకు కృతజ్ఞతలు.

**శ్రీ వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి గారు**



రైతు బాగుంటేనే రైతు కూలీతో పాటు రాష్ట్రం బాగుంటుందని గట్టిగా నమ్ముతున్న ప్రభుత్వం ఇదని, రైతుల కష్టాలు బాగా తెలిసిన మీ బిడ్డ ఇక్కడ సీ.ఎం.గా ఉన్నాడని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి గారు అన్నారు. అందుకే రైతులు నష్టపోకూడదని ప్రతి అడుగులో వారికి అండగా ఉంటూ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందరికీ న్యాయం జరిగేలా అన్ని విషయాల్లో అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. రైతన్నల మీద ప్రభుత్వానికి ఉన్న బాధ్యత, మమకారం, ప్రేమకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. గత 24 నెలల్లోనే రైతుల కోసం ఏకంగా రూ. 83వేల కోట్లు ఖర్చు చేశామని, మే నెలలోనే రైతులకు రూ. 5,748 కోట్లు ఇచ్చామని తెలిపారు. రైతుల కోసం ఏకంగా రూ. 14 వేల కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ స్పెషాలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రివర్యులు పేర్కొన్నారు. ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి 2020 ఖరీఫ్‌కు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం కింద 15.15 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ. 1,820.23 కోట్లను కంప్యూటర్లో బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కేంద్రాల్లోని రైతులు, అధికారులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. 2020 ఖరీఫ్‌లో భారీవర్షాలు, తుఫాన్లు, చీడపురుగుల వంటి కారణాలతో దాదాపు 15.15 లక్షల రైతులు నష్టపోతే, వారికి మంచి చేస్తూ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారంగా రూ. 1,820.23 కోట్లను ఎక్కడా వివక్ష చూపకుండా, పూర్తి పారదర్శకంగా, లంచాలకు తావులేకుండా, ఏ ఒక్కరికి నష్టం కలగకుండా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. బీమా కింద గత ప్రభుత్వం రైతులకు 2018-19 ఇన్సూరెన్స్ ఇవ్వకపోతే ఆ బకాయిలు రూ. 715 కోట్లు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెల్లించామన్నారు. 2019-20 కి సంబంధించి ఉచిత పంటల బీమా పరిహారం కింద మరో రూ. 1,252 కోట్లు ఇచ్చామని చెప్పారు. ఆ విధంగా రెండూ కలిపి రైతులకు దాదాపు రూ. 1,968 కోట్లకు పైగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం చెల్లించామని వివరించారు. ఈ చెల్లింపులతో కలిపి మొత్తం రూ. 3,788 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం శ్రీ జగన్ గారు ఇంకా ఏమన్నారంటే..

- గతంలో తుఫానులు, చీడపురుగుల వల్ల పంట నష్టం జరిగితే.. పరిహారం ఎప్పుడు, ఎంతమందికి, ఎంత ఇస్తారో తెలిసేది కాదు. కాబట్టి రైతులకు బీమా మీద నమ్మకం ఉండేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. 2020 ఖరీఫ్‌లో పంట నష్టం జరిగితే, ఆ తర్వాత ఏడాదిలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఆ పరిహారం ఇస్తున్నాం .
- గతంతో పోలిస్తే పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా వెంటనే అదే సీజన్లో ఇచ్చామని గర్వంగా మీ బిడ్డగా తెలియజేస్తున్నాను. 2020 ఖరీఫ్‌లో పంట నష్టం జరిగితే, ఆ సీజన్ ముగిసేలోపే రూ. 930 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. రైతులకు ఒక్కపైసా భారం లేకుండా మొత్తం ప్రీమియం మనందరి ప్రభుత్వమే కడుతోంది. రైతుల పట్ల ఉన్న ప్రేమ, మమకారం, బాధ్యతకు బీమా పథకమే నిదర్శనం. ఈ 24 నెలల కాలంలో రైతుల కోసం చేసిన ఖర్చు రూ. 83 వేల కోట్లు అని సగర్వంగా మీ బిడ్డగా తెలియజేస్తున్నాను. 52 లక్షల మందికి పైగా రైతులకు ఏటా రూ. 13,500 చొప్పున రైతు భరోసా కింద ఇస్తున్నాం.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# కష్టకాలంలోనూ రైతు భరోసాతో సాయం

కోవిడ్ సంక్షోభంలో ప్రభుత్వం కంటే రైతుల కష్టమే ఎక్కువ అని భావించాని, ఆదాయ వనరులు తగ్గినప్పటికీ రైతులకు ఇచ్చిన మాట మేరకు వరుసగా మూడో ఏడాది రైతు భరోసా కింద ఆయా రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని సీఎం శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు పేర్కొన్నారు. సాగులో రైతులు ఏ ఇబ్బంది పడకూడదన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని, వారి కోసం గత 24 నెలల్లో ఎన్నో కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు రైతులకు పంట పెట్టుబడి సాయంగా వరుసగా మూడో ఏడాది వై.ఎస్.ఆర్. రైతు భరోసా కింద తొలి విడతగా 52.38 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ. 7,500 చొప్పున ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్‌లో బటన్ నొక్కి రూ. 3,928 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాల్లో రైతులు, అధికారులనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కోవిడ్ సమూల నిర్మూలనకు వ్యాక్సినేషన్ ఒక్కటే పరిష్కారమని, కానీ దేశంలో తగినంత వ్యాక్సిన్ ఉత్పత్తి కావడం లేదన్నారు. అందువల్ల కోవిడ్‌తో సహజీవనం చేస్తూనే ఎదుర్కోక తప్పదని చెప్పారు. కోవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ రైతులు తమ పని చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. వ్యాక్సినేషన్ పూర్తి అయ్యేవరకు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించడం, చేతులు కడుక్కోవడం, భౌతిక దూరం పాటించడం దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం శ్రీ జగన్‌మోహన్‌రెడ్డి గారు ఇంకా ఏమన్నారంటే...

## 24 నెలలు... రూ. 83 వేల కోట్లు

వినడానికి ఆశ్చర్యం కలిగించే విధంగా ఉన్నప్పటికీ ఈ 23 నెలల పాలనలో దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనలతో దాదాపు రూ. 83 వేల కోట్లు నేరుగా బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశాము. ఎక్కడా వివక్ష లేకుండా, లంచాలకు తావు లేకుండా, పూర్తి పారదర్శకంగా, పక్కాగా సామాజిక తనిఖీలు చేసి, ఏ ఒక్క అర్హుడు మిస్ కాకుండా అందరికీ ప్రయోజనం కల్పించాం. ప్రతి పేద వాడికి సహాయం అందించే విధంగా అడుగులు ముందుకు వేశాము.

## రైతు భరోసా కింద రూ. 17,029 కోట్లు

మూడో ఏడాది తొలి విడతగా ఇవాళ అర కోటి మందికి పైగా రైతులకు రూ. 3,928 కోట్లు వారి ఖాతాల్లో వేస్తున్నాము. 2019-20 నుంచి ఇప్పటి వరకు ఒక్క రైతు భరోసా కింద రూ. 19.101 కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని రైతు బిడ్డగా, మీ బిడ్డగా గర్వంగా చెబుతున్నాను.

## ప్రతి రైతుకూ ఈ పథకం ద్వారా మేలు

దేశంలో ఎక్కడా లేని విధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు, అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులు, అటవీ హక్కు పత్రాలు (ఆర్.ఓ.ఎఫ్.ఆర్.) పొంది సాగు చేసుకుంటున్న గిరిజన రైతులు, దేవాలయాల భూములు సాగు చేస్తున్న రైతులకు కూడా వై.ఎస్.ఆర్. రైతు భరోసా వర్తింప చేస్తున్నాం.

రాష్ట్రంలో దాదాపు 50 శాతం రైతులకు అర హెక్టారు (1.25 ఎకరాలు) భూమి మాత్రమే ఉంది. అదే ఒక హెక్టారు (2.5 ఎకరాల) వరకు భూమి ఉన్న రైతులతో కలుపుకుంటే దాదాపు 70 శాతం ఉన్నారు. వై.ఎస్సార్. రైతు భరోసా కింద ప్రభుత్వం చేస్తున్న రూ.13,500 సాయం, ఆ రైతులందరికీ దాదాపు 80 శాతం సరిపోతుంది.

ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్ళు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పినా, అధికారంలోకి రాగానే రైతన్నల కష్టాలు చూసి, చెప్పిన దానికన్నా ఒక ఏడాది ముందుగానే, ఇస్తామన్న దాని కన్నా మరో వెయ్యి రూపాయలు ఎక్కువగా రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా రూ. 13,500 చొప్పున అయిదేళ్ళలో మొత్తం 67,500 రూపాయలు చొప్పున సహాయం చేస్తున్నాము. ఆ విధంగా రైతన్నలకు రూ.17,500 అదనంగా ఇవ్వగలుగుతున్నాం.



"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

## రైతులకుదగ్గరయ్యాం ..

- గతంలో తుఫానులు, చీడపురుగుల వల్ల పంట నష్టం జరిగితే.. పరిహారం ఎప్పుడు, ఎంతమందికి, ఎంత ఇస్తారో తెలిసేది కాదు. కాబట్టి రైతులకు బీమా మీద నమ్మకం ఉండేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. 2020 ఖరీఫ్‌లో పంట నష్టం జరిగితే, ఆ తర్వాత ఏడాదిలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఆ పరిహారం ఇస్తున్నాం.
- గతంతో పోలిస్తే పంట నష్టం జరిగితే ఇన్పుట్ సబ్సిడీ కూడా వెంటనే అదే సీజన్లో ఇచ్చామని గర్వంగా మీ బిడ్డగా తెలియజేస్తున్నాను. 2020 ఖరీఫ్‌లో పంట నష్టం జరిగితే, ఆ సీజన్ ముగిసేలోపే రూ. 930 కోట్లు ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చాం.
- రైతులకు ఒక్కపైసా భారం లేకుండా మొత్తం ప్రీమియం మనందరి ప్రభుత్వమే కడుతోంది. రైతులపట్ల ఉన్న ప్రేమ, మమకారం, బాధ్యతకు బీమా పథకమే నిదర్శనం.

## 24 నెలలు.. రూ. 83 వేలకోట్లు

- ఈ 24 నెలల కాలంలో రైతులకోసం చేసిన ఖర్చు రూ. 83 వేల కోట్లు అని సగర్వంగా మీ బిడ్డగా తెలియజేస్తున్నాను. 52 లక్షల మందికి పైగా రైతులకు ఏటా రూ. 13,500 చొప్పున రైతు భరోసా కింద ఇస్తున్నాం. ఆయా పథకాలు, కార్యక్రమాలు కోసం ఇలా ఖర్చు చేశాం..

## ఆర్బీకేలు – సేవలు

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 2 వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయం.. వాటి దగ్గరే 10,778 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేశాం. విత్తనం మొదలు పంటల అమ్మకం వరకు ప్రతి అడుగులో రైతులకు తోడుగా నిలబడుతున్నాం.
- పాడి రైతులకు కూడా మెరుగైన ఆదాయం వచ్చేలా సహకార రంగంలోని సంస్థ అమూల్‌ను తీసుకువచ్చాం. ప్రతి రైతు, ప్రతి అక్క చెల్లెమ్మకు ప్రతి లీటరుకు రూ. 5 నుంచి రూ. 15 వరకు అదనంగా ఇవ్వగలుగుతున్నాం.
- రూ. 14 వేల కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ స్పెషాలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం.
- వైఎస్సార్ జలకళ పథకం కింద 4 ఏళ్లలో రూ. 4,932 కోట్ల వ్యయంతో దాదాపు 2 లక్షల బోర్లు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సన్న, చిన్నకారు రైతులకు మోటార్లు కూడా ఉచితంగా ఇవ్వబోతున్నాం.

## ఆ కుటుంబాలను ఆదుకుంటున్నాం

- ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ. 7 లక్షలకు పెంచాం. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన దాదాపు 434 రైతుల కుటుంబాలకు పరిహారం ఇచ్చాం. ప్రతి జిల్లాలో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేశాం.

| పథకం / కార్యక్రమం | వెచ్చించిన సొమ్ము (రూ. కోట్లలో) | పథకం / కార్యక్రమం | వెచ్చించిన సొమ్ము (రూ. కోట్లలో) |
|---|---|---|---|
| వైఎస్సార్ రైతుభరోసా | రూ. 17,030 | ధాన్యం సేకరణ (గత ప్రభుత్వ బకాయి రూ. 960 కోట్లు సహా) | రూ. 30,406 |
| రైతులకు పగటిపూటే ఉచితంగా నాణ్యమైన విద్యుత్ | రూ. 17,430 | గత ప్రభుత్వ విత్తన బకాయిలు | రూ. 384 |
| లోవోల్టేజీ సమస్య నివారణకు ఫీడర్ల అప్‌గ్రేడ్ | రూ. 1700 | శనగ రైతులకు బోనస్ | రూ. 300 |
| ఉచిత పంటల బీమా | రూ. 3788 | ఇతర పంటల కొనుగోలు కోసం | రూ. 5,964 |
| రైతులకు సున్నా వడ్డీ పంట రుణాలు | రూ. 1261 | మైక్రో ఇరిగేషన్, పండ్ల తోటలకు | రూ. 1,264 |
| ఇన్పుట్ సబ్సిడీ | రూ. 1,038 | ఆక్వా రైతులకు రూ. 1.50 కే యూనిట్ విద్యుత్ | రూ. 1,560 |

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



# గంగ పుత్రులకు మత్స్య భరోసా అండ

ఆక్వా రైతులకు, సముద్రంలోకి చేపలవేటకు వెళ్లి తెచ్చుకున్న సరుకుకు మంచి ధరవచ్చేందుకు రాష్ట్రంలో 100 ఆక్వాహబ్లు, వాటి ఆధీనంలో 12,000 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారు ప్రకటించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి మత్స్యకార భరోసా నిధులు రూ.119.88 కోట్లను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలలోకి సీఎం జమ చేశారు. మొత్తం 1,19,875 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలచొప్పున పంపించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ ఒక్క ఆక్వారైతు, మత్స్యకారుడు నష్టపోకూడదనేది ప్రభుత్వ లక్ష్యం. వారికి గిట్టుబాటు ధరకల్పించేందుకు వంద ఆక్వాహబ్‌లు ఏర్పాటుచేస్తున్నాం . ఒక్కోహబ్ పరిధిలో 120 దుకాణాల చొప్పున 12,000 రిటైల్ షాపులు ఉంటాయి. దీనివల్ల ఆక్వా ఉత్పత్తులకు, మత్స్యకారులు వేటకు వెళ్లి తెచ్చే చేపలకు మంచిగిట్టుబాటు ధర పలుకుతుంది. రెండేళ్లలోనే వీటి ఏర్పాటులో పురోగతి సాధిస్తాం .

మత్స్యకారుల ఉపాధికి రాష్ట్రంలో 8 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నాం. గుంటూరు జిల్లా నిజాంపట్నం, కృష్ణాజిల్లా మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల ఆధునికీకరణతోపాటు ఉప్పాడ తూర్పుగోదావరి), జువ్వెలదిన్నె (నెల్లూరు)లలో కొత్తగా నిర్మిస్తున్నాం. వీటిపనులు రూ. 1509.80 కోట్ల అంచనవ్యయంతో మొదలయ్యాయి. రెండోదశలో రూ.1,365, 35 కోట్లతో బుడగట్లపాలెం (శ్రీకాకుళం), పూడిమడక (విశాఖ). బియ్యపుతిప్ప (పశ్చిమగోదావరి), కొత్తపట్నం (ప్రకాశం)లలో నాలుగు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడతాం. టెండర్లు ఖరారుచేసి ఈ ఏడాదే పనులు ప్రారంభిస్తాం. వీటితో 80 వేలమందికి ఉపాధి లభిస్తుంది.

కోవిడ్‌తో ఆర్థిక ఇబ్బందులున్నా మత్స్యకార భరోసా కింద నిధులు జమచేశాం. తొలి ఏడాది లక్షమంది లబ్ధిదారులు ఉండగా ఈ ఏడాది 1.20 లక్షలకు పెరిగారు. ఇంతవరకు రూ.332 కోట్లు మత్స్యకారభరోసా కింద చెల్లించాం. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 23 నెలల కాలంలో అక్కాచెల్లెమ్మలకు, పేదలకు మంచిజరగాలనే ప్రతికార్యక్రమం చేస్తున్నాం. తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో ఓఎన్జీసీ తవ్వకాలతో 14,927 మత్స్యకార కుటుంబాలు ఉపాధికోల్పోతే ఆ సంస్థ సాయం చెయ్యకున్నా రూ.75 కోట్లు ప్రభుత్వమే ఇచ్చింది. గతంలో చేపలవేట సమయంలో రూ.4వేలు, డీజిల్పై రూ.6 రాయితీ ఇస్తామని చెప్పినా ఏనాడూ సక్రమంగా ఇవ్వలేదు. అది 5 వేల పడవలకే ఇచ్చేవారు. ప్రస్తుతం 26,823 పడవలకు లీటరు డీజిలుకు రూ.9 సబ్సిడీఇస్తున్నాం. వంద పెట్రోలు బంకులను ఇందుకోసం కేటాయించాం. చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు చనిపోగా అలాంటి 67 కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున రూ.6.7 కోట్లు అందించాం. ఆక్వాసాగుకు యూనిట్కు రూ.1.50 కే సరఫరా చేస్తూ 53,550 మంది రైతులకు ప్రయోజనం కల్పించాం. రెండేళ్లలో రూ.1,580 కోట్ల రాయితీని భరించాం. రాష్ట్రంలో 35 చోట్ల ఆక్వా ఇంటిగ్రేటెడ్ ల్యాబులు రూ.50.30 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశాం. విత్తనం నుంచి మేతవరకు అన్నీ అందిస్తున్నాం. వాటిని రైతుభరోసా కేంద్రాలతో సంధానం చేస్తున్నాం. పశ్చిమ గోదావరి జిల్లాలో ఏపీ మత్స్య యూనివర్సిటీ పనులను ఈ సంవత్సరంలోనే ప్రారంభిస్తాం.




"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# రైతు విత్తనం రైతుకే



మనం సాగు చేయాలనుకునే పంటకు కావాల్సిన విత్తనం మన ఊళ్లోనే దొరికితే అంతకన్నా ఆనందం ఏముంటుంది. సరిగ్గా ఇదే ఆదరించి చూపించింది మన జగనన్న ప్రభుత్వం. ప్రతిసారి విత్తనం కోసం ఎక్కడెక్కడికో వెళ్లి నానాకష్టాలుపడి, ఎండలో ఆకలికి నిలబడి ఆటోలు, ట్రాక్టర్లలో తెచ్చుకోవాల్సి వచ్చేది. అయితే ఈ ఖరీఫ్‌కు ఆ బాధలన్నీ తప్పాయి. మనం వేయదల్చుకున్న వరి, వేరుశనగ, కందులు వంటి విత్తనాన్ని మన తోట రైతులు పండించినవి, మనకు అందుబాటు ధరలో అందిస్తోంది మన ప్రభుత్వం. దీనివల్ల పండించిన రైతుకు గిట్టుబాటు ధర, పంట సకాలంలో అమ్ముకోవడం, డబ్బు వెంటనే అందడం, మనకు మన ఊళ్ళో, దగ్గరి ప్రాంతంలో నాణ్యమైన విత్తనం అందడం. సీజన్ ఏదైనాసరే స్థానిక లభ్యతను బట్టి సాగు విస్తీర్ణంలో 30 శాతం విత్తనాన్ని సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తుంటారు. సకాలంలో సబ్సిడీ విత్తనం దొరక్క దళారీలు, ప్రైవేటు ఏజెన్సీల ఉచ్చులో పడి రైతులు ఏటా వందల వేల కోట్ల రూపాయల పెట్టుబడిని నష్టపోయేవారు. కానీ ఇప్పుడా పరిస్థితిలేదు. గత రెండేళ్లుగా సకాలంలో ప్రభుత్వం నాణ్యమైన విత్తనాన్ని అందించడమే కాకుండా ప్రైవేటు ఏజెన్సీలపై నిఘా ఉంచడంతో 'నాసిరకం' అనేమాట వినిపించలేదు. ఖరీఫ్ సీజన్లో 92.45 లక్షల ఎకరాలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానంగా 41.20 లక్షల ఎకరాల్లో వరి, 18.02 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 7.60 లక్షల ఎకరాల్లో అపరాలు సాగు చేయనున్నారు. సీజన్ కోసం 7,91,439 క్వింటాళ్ల విత్తనం అవసరంకాగా, లక్ష్యానికి మించి 7,98,125 క్వింటాళ్లు సిద్ధం చేశారు. ఇప్పటికే సిద్ధంచేసిన 85 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట (జనుము, పిల్లిపెసర, జీలుగు) విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు ఆర్బీకేల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టారు.

## విత్తనోత్పత్తి, పంపిణీలోమరిన్నిసంస్కరణలు

2021-22 వ్యవసాయ సీజను నుంచి విత్తన పంపిణీలో మరిన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. సీజన్ ప్రారంభం కాకుండానే కావాల్సిన విత్తనాన్ని సేకరించి ప్రాసెస్ చేసి, పరీక్షించి సర్టిఫై చేసి ఆర్బీకేల ద్వారా పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. గతంలో ఏటా 10 వేల వరకు శాంపిల్స్ పరీక్షించేవారు. కానీ ఈ ఏడాది ర్యాండమ్‌గా 20 వేల నుంచి 25 వేల శాంపిల్సుని విజయవాడ, కర్నూలులోని సంస్థకు చెందిన ల్యాబుల్లో పరీక్షించి సర్టిఫై చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విత్తన సేకరణ, ప్రాసెస్, పంపిణీ కోసం గతేడాది రూ.573 కోట్లు ఖర్చు చేస్తే, ఈ ఏడాది రూ.700 కోట్లు ఖర్చు చేస్తోంది. సబ్సిడీ కింద గతేడాది రూ.296 కోట్లు భరించగా, ఈ ఏడాదిరూ. 350 కోట్లు భరించేందుకు సిద్ధమైంది.

## తొలిసారి సొంతంగా వేరుశనగ విత్తనం

చరిత్రలో తొలిసారిగా గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద క్వింటాల్‌కు రూ.6,500 చొప్పున చెల్లించి 25 వేల మంది రైతుల నుంచి 476841 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాన్ని APSSDC ద్వారా సేకరించారు. 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. 2,318 మంది రైతుల నుంచి ఎ.పి. మార్క్‌ఫెడ్ 1501 క్వింటాళ్ళు కొనుగోలు చేసింది. వరి విషయానికి వస్తే డిమాండ్ ఎక్కువగా ఉన్న ఎంటీయూ 7029, 1121, 1064, 1061, బీపీటీ 5204, ఆర్జిఎల్ 2537 రకం విత్తనాలను విత్తనోత్పత్తి ద్వారా పంపిణీకి సిద్ధం చేశారు. కంది విత్తనాలు 213450 మిని కిట్లు రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పంపిణీ చేశారు. అపరాలు 22.743 క్వింటాళ్ళు, తృణధాన్యాలు 3,310 క్వింటాళ్లు సిద్ధం చేశారు. ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయం కొత్తగా అభివృద్ధిచేసిన ఎంటీయూ 1224, ఎంటీయూ 1210, రాగి వేగావతి, కదిరి లేపాక్షి (వేరుశనగ) రకాలకు చెందిన ఫౌండేషన్స్ ఈ మార్కెట్లోకి తీసుకొస్తున్నారు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# ధాన్యం రైతు 'ధర' హాసం

రాష్ట్రంలో ధాన్యాన్ని ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు (ఎమ్మెస్పీ) భారీగా కొనుగోలు చేస్తుండటంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. ఉన్న ఊళ్లోనే ధాన్యాన్ని అమ్ముకో గలుగుతున్నారు. తద్వారా రవాణా ఖర్చు ఆదా అవుతోంది. ప్రస్తుత రబీలో ధాన్యాన్ని విక్రయించేందుకు ఆర్బీకేల ద్వారా 3.55 లక్షల మంది రైతులు తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. జూన్ మొదటి వారానికి 2,11,320 మంది రైతుల నుంచి రూ. 4,521.08 కోట్ల విలువైన 24,14,969.28 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రబీ పంటకోతలు పూర్తయ్యాయి. దాంతో ఆ ప్రాంతాల్లో ఇప్పటికే అధిక భాగం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. నెల్లూరు, ప్రకాశం.. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే పంటకోతలు ప్రారంభమవుతుండటంతోఆ ప్రాంతాల్లోనూ వేగంగా ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాలశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఆర్బీకేల ద్వారా కళ్లాల వద్దే కొనుగోలు చేయడమే కాకుండా 21 రోజుల్లోగా అన్నదాతల ఖాతాల్లోడబ్బు జమ చేస్తున్నారు. ప్రభుత్వమే భారీ ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్లోనూ అదేధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిణామం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 24,14,969.28 టన్నులు కొనుగోలు

- రబీలో రైతులు 21.75 లక్షల హెక్టార్లలో, వరిపంట సాగు చేశారు. దిగుబడి అయిన ధాన్యాన్ని వీలైనంతంగా కొనుగోలు చేయాలని పౌరసరఫరాలశాఖ అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే 24,14,969.28 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం విశేషం. కొనుగోళ్లు ఇంకా కొనసాగుతున్నాయి.
- ప్రభుత్వం ధాన్యం క్వింటాలుకు సాధారణ రకానికి రూ.1868, ఏ–గ్రేడ్ రకానికి రూ.1888 ఎమ్మెస్పీగా ప్రకటించి, అదేధరకు కొనుగోలు చేస్తోంది. రైతుల కళ్లాల వద్దే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారు ఆదేశించారు. దాంతో గ్రామాల్లోని 7,706 ఆర్బీకేలతో పౌరసరఫరాలశాఖ నేతృత్వంలోని 3,936 ధాన్యం కొనుగోలు కేంద్రాలను అనుసంధానం చేశారు.
- ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు తమ పేర్లను ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో నమోదు చేయించుకోవాలి. ఈ పంటలో ఆ రైతులు వరిసాగు చేశారా లేదా అన్నది సరిచూసుకుని, 'కళ్లాలవద్దే ధాన్యం కొనుగోలుకు కూపన్లు జారీచేస్తారు. ఏరోజున ఏ సమయంలో ధాన్యాన్ని 'కొనుగోలుచేస్తారన్నది ఆ కూపన్లలో స్పష్టంగా ఉంటుంది.
- ఆ మేరకు ఆర్బీకేలోని వీఏఏ (గ్రామ వ్యవసాయ సహాయకుడు) కళ్లం వద్దకు వెళ్లి ధాన్యం నాణ్యతను పరిశీలించి, కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. ఎఫ్.సీ.ఐ. (భారత ఆహార సంస్థ ప్రమాణాల మేరకు నాణ్యత లేకపోతే.. ధాన్యంలో తేమశాతం తగ్గేవరకు ఆరబెట్టాలని వీఏఏ సూచిస్తారు. ఆ తర్వాత ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన 21 రోజుల్లోగా రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తారు.



"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

సాంకేతిక విజ్ఞానం

# పచ్చిరొట్ట ఎరువులు పంటల అవశేషాలతో భూసార అభివృద్ధి

డా. పి. సుజాతమ్మ, ప్రధానశాస్త్రవేత్త, (పంటల ఉత్పత్తి) మరియు సమన్వయకర్త, ఏరువాక కేంద్రం కర్నూలు.

మనం ప్రతి పంటలో రసాయన ఎరువులలో పాటు సేంద్రీయ ఎరువులు సిఫారసు చేసినప్పటికీ, సేంద్రీయ ఎరువుల అందుబాటు సంవత్సర, సంవత్సరానికి తగ్గుతూ వస్తున్న ప్రస్తుత పరిస్థితులలో, పంటల సాగులో రైతులు చాలా వరకు రసాయనిక ఎరువుల ద్వారానే పోషకాలు అందిస్తున్నారు.

సేంద్రీయ ఎరువులు సరిపడా వాడని కారణంగా నేలలో సేంద్రీయ కర్బనం తగ్గి కనీసం మధ్యస్థంగా నైనా (0.5-0.75%) ఉండవలసి ఉంటే,ప్రస్తుతం తక్కువ (0.5% కంటే తక్కువ) స్థాయి లోనే నమోదవుతుంది.అంతే కాక పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు తగినంత స్థాయిలో ఉండటంలేదు. పంటలు సూక్ష్మపోషక లోపాలకు గురవుతున్నాయి. నేలలు నీటిని నిలుపుకునే శక్తి తగ్గిపోతుంది.నేలలో వేసిన రసాయనిక ఎరువుల నుండి పోషకాలు వృధా అయ్యే అవకాశాలు ఎక్కువ అవుతున్నాయి.ఇలా వివిధ కారణాలుగా నేలలు ఉండవలసినంత సారవంతంగా లేక,సాగులో ఆశించినంత ఫలితాలు రావడంలేదు.ఈ సమస్యలను అధిగమించడానికి సేంద్రీయ పదార్థం నేలకు అందేలా పచ్చిరొట్ట /పచ్చి ఆకు ఎరువులు/ పంట అవశేషాలు వినియోగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## పచ్చిరొట్ట ఎరువుల వలన ప్రయోజనాలు

- జీలుగలాంటి పచ్చిరొట్ట ఎరువులను వాడినపుడు చౌడు తగ్గుతుంది.
- పప్పు జాతి పంటలను పచ్చిరొట్ట ఎరువులుగా వేసి భూమిలో కలియ దున్నడం వలన సుమారు 25-30% నత్రజనిని ఆదా చేయవచ్చు అంతేకాకుండా పచ్చిరొట్ట ఎరువులు కుళ్ళేటప్పుడు వచ్చే సేంద్రీయ ఆమ్లాల వలన భూమిలోని భాస్వరం మరియు పొటాష్ కూడా మొక్కలకు అందుబాటులోకి వస్తాయి తద్వారా రసాయన ఎరువులకు అయ్యే ఖర్చును తగ్గించుకోవచును.
- పచ్చిరొట్ట ఎరువులు నేలలో బాగా చివికిన తర్వాత నేలకు సేంద్రీయ పదార్థం అందుతుంది. దీని వలన భూ భౌతిక,రసాయన పరిస్థితులు మెరుగు పడతాయి.
- పచ్చిరొట్ట కుళ్లడం వలన నేలలో హుమస్ పెరుగుతుంది దీని వలన నేలకు నీరు,పోషక పదార్థాలను నిల్వ చేసుకొనే శక్తి పెరుగుతుంది.అంతే కాక పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుంది.

## పచ్చిరొట్ట ఎరువులను ఎంపిక చేసుకోవడంలో గమనించవలసిన అంశాలు:

- పైరు త్వరగా ఏపుగా పెరిగి నేలను ఆక్రమించుకొనే స్వభావం కలిగి ఉండాలి.దీని వలన ఎక్కువ పరిమాణంలో పచ్చిరొట్ట ఎరువును అందిచవచ్చును.
- కలియ దున్నినపుడు త్వరగా నేలలో కలిసిపోయే స్వభావం కలిగి ఉండాలి.
- వాతావరణం లోని నత్రజనిని స్థిరీకరించగలిగే స్వభావం కల లెగ్యూమ్ జాతి పంటలను ఎన్నుకోవాలి.

## వివిధ పచ్చిరొట్ట పైర్లు - వాటి పోషకాలు

**జీలుగ :** చౌడు భూములకు అనుకూలం.ఎకరానికి 12-15 కిలోల విత్తనాలు అవసరం. ఈ పంటను 70-80 రోజుల్లో



జీలుగ



పిల్లిపెసర



జనుము

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

కలియ దున్నాలి . సెస్బేనీయ అక్యూలియేట, సెస్బేనీయ రోస్ట్రేట అనే రెండు జాతులున్నాయి. సెస్బేనీయ రోస్ట్రేట 7 వారాల్లోనే ఒకటిన్నర మీటర్ల ఎత్తు పెరిగి మృదువైన ఆకులనిస్తుంది. సెస్బేనీయ అక్యూలియేట హెక్టారుకు 32 టన్నుల పచ్చిరొట్టని ఇస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో సుమారు 5కిలోల నత్రజని ఉంటుంది.

**జనుము :** ఎకరానికి 10-15 కిలోల విత్తనం అవసరం పూత దశలో కలియదున్నాలి. పైరు త్వరగా పెరిగి మృదువైన ఆకులనిస్తుంది. హెక్టారుకు 20-25 టన్నుల పచ్చిరొట్టనిస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో సుమారు 4కిలోల నత్రజని ఉంటుంది.

**పిల్లి పెసర :** పిల్లి పెసర పచ్చిరొట్ట ఎరువుగాను,పశుగ్రాసం గాను ఉపయోగించుకోవచ్చు. నేలలో నీరు నిల్వ ఉన్నా నీటి ఎద్దడి ఉన్నా తట్టుకోగలదు ఎకరానికి 4-5 కిలోల విత్తనాలు కావాలి. పూత దశలో కలియదున్నాలి. హెక్టారుకు 5-6 టన్నుల పచ్చిరొట్టనిస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో 7.2కిలోల నత్రజని,1కిలో భాస్వరం,5.3 కిలోల పొటాష్ ఉంటాయి.

వీటితోపాటు అలసంద, ఉలవలు మరియు పెసర పంటలను కూడా పచ్చిరొట్ట పంటలుగా సాగుచేసుకోవచ్చు. ఎన్నో ఉపయోగాలు కలిగినటువంటి పచ్చిరొట్ట పైర్లు రైతులందరు వేసుకొని తమ పొలాల్లో భూసారం పెంచుకోవాలి.

మన ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా పచ్చిరొట్ట ఎరువులుగా విత్తనోత్పత్తికి రబీ కాలం అనుకూలమైనది.అనగా సెప్టెంబర్ నుండి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. చివరి దుక్కిలో అనగా విత్తనం వేసేముందు ఎకరానికి 20కిలోల నత్రజని మరియు 20 కిలోల భాస్వరం ఎరువులను వేయాలి.

## పచ్చి ఆకు ఎరువులు :

పచ్చి ఆకు ఎరువుల పంటలైన సుబాబుల్, గ్లైరిసిడియా, కానుగ, తంగేడు, జిల్లేడు,వేప వంటి చెట్ల నుంచి లేత కొమ్మలు ఆకులను సేకరించి పొలంలో వేసి బాగా కలియదున్నాలి.తర్వాత నీరు పెట్టి బాగా కలియదున్నాలి. ఇవి కూడా భూసారాన్ని పెంచడంలో బాగా దోహదపడుతాయి.

## పంటల అవశేషాలు:

మనం సాగుచేసే ముఖ్యమైన పంటలు, వాటి నుండి లభ్యమయ్యే అవశేషాలు,ఈ అవశేషాలు నేలలో కలియదున్నినపుడు నేలకు అందె ముఖ్య పోషకాలు దిగువ పట్టికలో పొందు పర్చడం జరిగింది.

| క్రమ సంఖ్య | పంట పేరు | అవశేషములు టన్నులు/ ఎకరానికి | పంటలఅవశేషాల నుండి నేలకు అందే వివిధ పోషకాలు (కిలోలు/ఎకరానికి) | | |
|---|---|---|---|---|---|
| | | | నత్రజని | భాస్వరం | పొటాషియం |
| 1. | ప్రత్తి | 2.5-3.0 | 12-15 | 3-5 | 10-15 |
| 2 | మిరప | 2.0-2.5 | 10-12 | 2-4 | 12-15 |
| 3 | కంది | 2.0-2.5 | 15-20 | 4-6 | 10-12 |
| 4 | మినుము | 1.5-2.0 | 12-15 | 3-5 | 7-10 |

పంటల అవశేషాలను నేలలో కలియ దున్నడం వలన ముఖ్య పోషకాలతో పాటుగా ఎంతో విలువైన సేంద్రీయ కర్బనం, సూక్ష్మ పోషకాలు,పోషక పదార్థాలు నేలకు చేకూరుతాయి. కాబట్టి రైతులు ప్రత్తి, మిరప,కంది మరియు మినుము పంటల అవశేషాలను తగలబెట్టకుండా నేలలో కలియదున్నాలి .ఇలా పచ్చిరొట్ట పంటను సాగుచేయడం,పచ్చి ఆకు ఎరువులను వేసు కోవడం, పంట అవశేశాలను నేలలో కలియ దున్నడం ద్వారా భూసారం అభివృద్ధి చెంది పంటల ఉత్పత్తి పెరిగే అవకాశం ఎంతైనా ఉంది.


వేప


కాటన్ ష్రెడ్డర్


సుబాబులు

# సాయిల్ హెల్త్ కార్డ్ - సూక్ష్మ పోషక ఫలితాల విశ్లేషణ



**శ్రీ యం.వి. శ్రీకాంత్,** ఎ.డి.ఎ. (ఎఫ్.టి.సి.), చిత్తూరు



ప్రస్తుతం వివిధ పంటలలో వివిధ సూక్ష్మ పోషక లోప లక్షణాలు అధికమై ఆశించిన మేర దిగుబడులను రైతాంగం పొందలేకపోతున్నారు. రసాయన ఎరువులను అధికంగా వాడటం, సేంద్రియ ఎరువులను తక్కువగా వాడడం వలన పలు సూక్ష్మ పోషకాల లోపాలు వివిధ పంటలలో కనిపిస్తున్నాయి. భూసార పరీక్షలో స్థూల పోషకాల విశ్లేషణతో పాటూ మన వ్యవసాయశాఖ 5 సూక్ష్మ పోషకాల విశ్లేషణా ఫలితాలను 'సాయిల్ హెల్త్ కార్డ్' ద్వారా రైతాంగానికి తెలియజేస్తున్నది. భూసార పరీక్షా కేంద్రాలలో జింకు, ఇనుము, బోరాన్, కాపర్, మరియు మాంగనీసు పోషకాల విశ్లేషణ జరిపి లోపాలను, వాటిని సవరించే మార్గాలను తెలియజేస్తున్నాయి.

**జింకు :** నత్రజని భాస్వర పోషకాల సమర్థ వినియోగానికి జింకు అవసరం. మొక్కలలో అమైనో ఆమ్లాలు, మాంసకృత్తులు తయారుకావడానికి అవసరం. అలాగే మొక్క ఎదుగుదలకు కావలసిన ఆక్సిన్స్ అనే హార్మోను తయారుకావడానికి కావాలి. క్షారగుణం సున్నపు శాతం అధికంగా నేలలు, తగినంతగా సేంద్రియ ఎరువులు వాడని పొలాలలో జింకు లోపం కనిపిస్తుంది. అధిక మోతాదుల్లో నత్రజని, భాస్వరం ఎరువుల వాడకం మరియు పోషకాల సమతుల్యత లోపించడం వల్ల లోపం కనిపిస్తుంది.

**ఇనుము :** ఆకుల్లో పత్రహరితం (క్లోరోఫిల్) తయారుకావడానికి ఇది ఆధారము. కిరణజన్య సంయోగ క్రియ ద్వారా కార్బో హైడ్రేట్ల తయారీకి సహాయపడుతుంది. మొక్కలోని అన్ని జీవక్రియలకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ తోడ్పడుతుంది. కొన్ని ఎంజైముల తయారీకి, కణాల శ్వాసక్రియకు, మొక్కలు నైట్రేట్లను, సల్ఫేట్లను తీసుకోవడానికి తోడ్పడుతుంది. అధిక క్షార భూముల్లోను, సున్నపుపాలు ఎక్కువగా గల నేలల్లోనూ, తేలిక నేలల్లోనూ, సేంద్రియ పదార్థం తక్కువ ఉన్న నేలల్లోనూ సాధారణంగా ఇనుము లోపాలు వచ్చే అవకాశాలు ఎక్కువ.

**బోరాను :** ఆకుల్లో తయారయ్యే పిండిపదార్థం మొక్కల్లోని అన్ని భాగాలకు చేరడంలోనూ, మొక్క నీటి అవసరాల మీద బోరాన్ ప్రభావం ఉంటుంది. మాంసకృత్తుల తయారీకి అవసరం. కణవిభజనకు, కణాల గోడలు గట్టిగా ఉండడానికి తోడ్పడుతుంది. మొక్కలు కాల్షియం గ్రహించడానికి, సక్రమంగా వినియోగించుకోడానికి తోడ్పడుతుంది. అతి తక్కువ పరిమాణంలో అవసరమయ్యే పోషకం ఇది. పరిమితికి మించి ఉన్నపుడు మొక్కకు హాని కలిగిస్తుంది. సాధారణంగా పాలచౌడు నేలలూ, అధిక లవణాల కారణంగా నాణ్యత లోపించిన సాగునీటిలో బోరాన్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది.

**కాపర్ :** క్లోరోఫిల్ తయారీలో దీని ఆవశ్యకత ఉంటుంది. ముఖ్యంగా ఎంజైముల చర్యలో రాగి ప్రముఖ పాత్ర వహిస్తుంది. మొక్కలలో విటమిన్ 'ఎ' తయారుకావడానికి తోడ్పడుతుంది. అధిక క్షారనేలలు, మురుగు సౌకర్యం లేని నేలల్లో రాగి లోపాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**మాంగనీసు :** ఆకుల్లో పత్రహరితం (క్లోరోఫిల్) తయారుకావడంలో ఇనుముతో పాటూ మాంగనీసు కూడా తోడ్పడుతుంది. ఎంజైములను ఉత్తేజపరచి జీవక్రియ చురుకుగా జరిగేటట్లు చేస్తుంది. ఆస్కార్బిక్ ఆమ్లము తయారుకు దోహదపడుతుంది. అధిక క్షారభూములు, సున్నపుపాలు ఎక్కువ గల నేలలు, తీవ్రమైన నీటి ఎద్దడి, అధిక ఉష్ణోగ్రత లాంటి పరిస్థితులు మాంగనీసు లోపానికి దారితీస్తాయి.

సాయిల్ హెల్త్ కార్డ్‌లో ఈ సూక్ష్మ పోషకాల విశ్లేషణా




ఫలితాలను రైతాంగం అర్థం చేసుకోవాలి. కార్డులో 'పరీక్ష విలువను' బట్టి 'లోపం ఉన్నదా' లేక 'సరిపడా ఉన్నదా' అన్న విషయం తెలుస్తుంది. లోపల ఉన్నప్పుడు సిఫారసు మేరకు సంబంధిత సూక్ష్మపోషక ఎరువును నేలలో గానీ, పైరుపై పిచికారి చేయడంగానీ చేయాలి.

**జింక్ :** నేలలో జింక్ 0.6 పి.పి.యం. లేదా అంతకంటే తక్కువ వున్నట్లయితే ఆ నేలలో జింక్ సరిపడాలేదు అని చెప్పడం జరుగుతుంది.

**సవరణ విధానం :** జింక్ లోపం ఉన్నచోట వరి పైరుకు మరియు ఆరుతడి పంటలకు హెక్టారుకు 50 కిలోలు మరియు మెట్ట పైర్లకు హెక్టారుకు 25 కిలోలు చొప్పున జింక్ సల్ఫేట్ దుక్కిలో వేయవలెను. ఈ విధముగా ప్రతి మూడు పంటలకు ఒకసారి వేయాలి. పైరు మీద జింక్ లోపం కనబడినపుడు 2 గ్రాముల జింక్ సల్ఫేట్, కొంత నిమ్మరసం ఒక లీటరు నీటిలో కలిపి 4 నుండి 5 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పైరు మీద పిచికారి చేయాలి. కాంప్లెక్స్ ఎరువులను జింక్ సల్ఫేట్‌లో కలిపి వేయరాదు. జింక్ సల్ఫేట్ వేసిన కనీసం 48 గంటల తరువాత కాంప్లెక్స్ ఎరువులు వేసుకుని, పంటలు వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువులను పైరుకు పైపాటుగా వాడరాదు.

**ఇనుము :** నేలలో ఇనుము 4.5 పి.పి.యం. లేదా అంతకంటే తక్కువ వున్నట్లయితే ఆ నేలలో ఇనుము సరిపడా లేదు అని చెప్పడం జరుగుతుంది.

సవరణ విధానం : పైరుపై ఇనుము లోప లక్షణాలు కనబడినపుడు 1 % ఫెర్రస్ సల్ఫేట్ ద్రావణాన్ని (10 గ్రాములు ఫెర్రస్ సల్ఫేట్ లేదా అన్నభేది, కొంత నిమ్మరసం లేదా 5 గ్రాములు నిమ్మ ఉప్పు ఒక లీటరు నీటిలో కలిపి) 7-10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చెయ్యాలి.

**బోరాన్ :** నేలలో బోరాన్ 0.5 పి.పి.యం. లేదా అంతకంటే తక్కువ వున్నట్లయితే ఆ నేలలో బోరాన్ సరిపడా లేదు అని చెప్పడం జరుగుతుంది.

**సవరణ విధానం :** హెక్టారుకు 5-10 కేజీల బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి లేదా పైరుపై 0.2% బోరాక్స్ ద్రావణాన్ని (2 గ్రాముల బోరాక్స్ ఒక లీటరు నీటికి కలిపి) 2-3 సార్లు పిచికారి చెయ్యాలి.

**రాగి :** నేలలో రాగి 0.2 పి.పి.యం. లేదా అంతకంటే తక్కువగా వున్నట్లయితే ఆ నేలలో రాగి సరిపడా లేదు అని చెప్పడం జరుగుతుంది.

సవరణ విధానం : పైరుపై రాగి లోప లక్షణాలు కనబడినపుడు 0.1% కాపర్ సల్ఫేట్ ద్రావణాన్ని (1 గ్రాము కాపర్ సల్ఫేట్, కొంత నిమ్మరసం ఒక లీటరు నీటిలో కలిపి) 7-10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చెయ్యాలి.

**మాంగనీసు :** నేలలో మాంగనీసు 2.0 పి.పి.యం. లేదా అంతకంటే తక్కువ వున్నట్లయితే ఆ నేలలో మాంగనీసు సరిపడాలేదు అని చెప్పడం జరుగుతుంది.

**సవరణ విధానం :** హెక్టారుకు 10-25 కేజీల మాంగనీసు సల్ఫేట్‌ను ఆఖరి దుక్కిలి వేసుకోవాలి. పైరుపై మాంగనీసు లోప లక్షణాలు కనబడినపుడు 1% మాంగనీసు సల్ఫేట్ ద్రావణాన్ని (10 గ్రాములు మాంగనీస్ సల్ఫేట్, కొంత నిమ్మరసం లేదా 2.5 గ్రాముల నిమ్మ ఉప్పు ఒక లీటరు నీటిలో కలిపి) 7-10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చెయ్యాలి.



# మెట్ట సాగులో దుక్కి దున్నే యంత్రాలు



**శ్రీమతి ఇ. సరళ,** వ్యవసాయాధికారిణి, రైతు శిక్షణా కేంద్రము, చిత్తూరు

వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక వ్యవసాయ విధానాలలో చాలా ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఎందుకంటే కొత్త వంగడాలు, వ్యవసాయ పద్ధతుల ద్వారా పెరిగిన ఉత్పాదకతను చేజిక్కించుకొని రైతు పూర్తి లాభం పొందాలంటే, గ్రామాలలో ఉండే వ్యవసాయ కూలీల లోటు మరియు సకాలంలో చేయవలసిన పనులను నిర్వర్తించేవరకు యాంత్రీకరణ మాత్రమే రైతుకు అండగా సహాయపడగలదు. ఈ యాంత్రీకరణ ముందుగా ట్రాక్టరును మొదలుకొని వ్యవసాయ పనులలో ఉపయోగపడే యంత్రాలను రూపొందించడం వరకు జరిగింది. పనిముట్లను సరైన పద్ధతులలో వాడేందువలన వ్యవసాయ పనులను సకాలంలో సమర్ధవంతంగా నిర్వర్తించవచ్చును. తద్వారా పంటల ఉత్పాదకత పెంచడంతో పాటు వ్యవసాయానికయ్యే ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చును. ఇంతేకాక వ్యవసాయ కూలీలపై ఆధారపడడాన్ని గణనీయంగా తగ్గించడంతోపాటు నాణ్యమైన ఫలితాన్ని పొందడంలో దోహదపడుతుంది.

రైతాంగం పొలం తయారీలో 9 లేదా 11 కర్రుల కల్టివేటరును ఉపయోగించి దాని తరువాత రోటోవేటరును వాడి పొలం తయారీ చాలా బాగా చేసినట్లు అనుకుంటారు. నిజానికి కల్టివేటరు అంతర కృషి చేసేందుకు రూపొందించిన నాగలి. కావున కల్టివేటరును ఉపయోగించడం ద్వారా 15 సెం.మీ. వరకు మాత్రమే పొలంలో దిగుబడి దుక్కి చేయడం జరుగుతుంది. ఇందుమూలంగా పంట వేళ్ళు ఉపరితంలో మాత్రమే ఏర్పడడం జరుగుతుంది. ఇలా పైపైనే పంట వేళ్ళు ఉండడం మూలంగా చెఱకు పంటలో గాలి కాలంలో అనగా అక్టోబరు, నవంబరు నెలలలో పడిపోవడం జరుగుతంది.

ఇందుకు ప్రత్యామ్నాయంగా పొలాన్ని లోదుక్కి దున్ని అనగా సుమారు 30 నుంచి 40 సెం.మీ. లోతుకు దున్ని ఆ తరువాత రోటోవేటరుతో కలియదున్ని తరువాత నాటడం వలన పంట దిగుబడి కూడా పెరుగుతుందని పరిశోధనా ఫలితాలు వెల్లడిస్తున్నాయి. లోతు దుక్కి వలన బలమైన వ్రేళ్ళు తయారై నీటిని మరియు పోషకాలను సమర్ధవంతంగా గ్రహించడం, పంట బాగా పండించడం వలన పంట దిగుబడి 10 నుండి 15 శాతం వరకు ఉత్పాదకత పెరిగే వీలుంది.

## 1. సబ్ సాయిలర్ లేదా చిసల్ ప్లౌ :

వ్యవసాయ పొలాలను సంవత్సరం పొడవునా రెండు లేదా మూడు పంటలను పండించడానికి ఎడతెరపి లేకుండా వాడడం వలన పొలంలోని పై పొరలలో పోషకాలు తగ్గి క్రమేపి పంట దిగుబడులు తగ్గిపోవడం ప్రతి రైతు గమనించి ఉంటారు. ఇలా తగ్గిపోవడానికి గల ముఖ్యమైన కారణాలలో దుక్కిని లోతుకు దున్నక పోవడం లోదుక్కి క్రింద నున్న గట్టి మట్టి పొరను ఛేదించడం వలన క్రమేణా పై మట్టి లో మట్టిలో కలిసి మొక్కకు కావలసిన పోషకాలను సమర్ధవంతంగా ఇవ్వగలుగుతాయి. ఇలా పొలాన్ని అతి లోతుగా దున్నేందుకు రూపొందించబడినదే 'సబ్ సాయిలర్' లేదా 'చిసిల్' నాగలి.

ఇది ఒకటి లేదా మూడు ధృఢమైన కర్రులచే నిర్మించబడిన నాగలి. దీనిని ఉపయోగించి దుక్కిని అతి లోతుగా అనగా 60 నుండి 90 సెం.మీ.ల లోతు వరకు దున్నవచ్చును. ఈ నాగలిని మూడు లేదా నాలుగు సంవత్సరాలకు ఒకమారు ఉపయోగించి దుక్కిని అతిలోతుగా దున్నడం వలన నేల కింది భాగంలోని గట్టి పొరను (హార్డ్ ప్యాన్) చీల్చి క్రొత్త మట్టిని సాయిల్‌తో కలపడం








"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"








జరుగుతుంది. ఇలా చేయడం వలన పలు లాభాలు ఉన్నాయని వ్యవసాయ పరిశోధనలు తెలుపుతున్నాయి. ముఖ్యంగా మెట్ట సేద్యంలో వర్షాధారపు పంటలను పండించేటపుడు ఈ సబ్ సాయిలర్ లేదా చిసిల్ నాగలి ద్వారా దున్నడం వలన లోతైన మట్టిపొరలను కదిలించి లోతైన పొరల్లో నేల గుల్లబారనివ్వడం వలన పడిన వర్షపు నీటిని ఎక్కువ భాగం పొలం లోపలి పొరలలో నిల్వ ఉంచేందుకు తోడ్పడుతుంది. ఈ నీటి నిల్వ గణనీయంగా పెరుగుట వలన పొలంలో పండించే పంట నీటి ఎద్దడికి లోనుకాకుండా ఉపయోగపడుతుంది. కాకపోతే పొలాన్ని అతి లోతుగా దున్నేందుకు కనీసం 45 హెచ్.పి. గల ట్రాక్టరును ఉపయోగించవలసిన అవసరం ఉంటుంది. దీనిద్వారా ఒక ఎకరం పొలమును 1 లేదా 1 1/2 గంటలలో దున్నవచ్చును.

2. రెక్క నాగలి (M.B. Plough) : ఇది అతి ముఖ్యమైన దుక్కిని దున్నడానికి రూపొందించబడిన నాగలి. ఆ నాగలిని ఎడ్లతో గాని ట్రాక్టరుతో గాని లాగినపుడు నాగలి యందలి కొర్రు భాగం నేలలో నిర్దేశించబడిన (నాగలి పరిమాణాన్ని బట్టి) లోతుకు దిగి ఆపై మట్టి పెళ్ళను సమర్ధవంతంగా భూమి నుండి వేరు చేస్తుంది. అలా వేరుచేయబడిన మట్టిపెళ్ళను నాగలి రెక్కపైకి పంపి పొడిగా చేస్తుంది. ఇంతేకాక పై రెక్క యొక్క వంపువలన మట్టిపెళ్ళను పూర్తిగా త్రిప్పి ప్రక్కకు వేస్తుంది. ఇది సుమారు 30-60 సెం.మీ. లోతు దున్ని నాగలి పరిమాణాన్ని బట్టి దుక్కిని పొందవచ్చు. దీనిలో దుక్కిన దుక్కినాణ్యత ఎడ్లతో నడిపే చెక్క నాగలిలో లేదా ట్రాక్టరుతో నడపబడే కల్టివేటరులో వచ్చే నాణ్యతతో పోలిస్తే మూడురెట్లు హెచ్చుగా ఉంటుంది. ఇదే కాకుండా రెక్క నాగలిలో ఉండే రెక్కను మన అవసరాన్ని బట్టి అనగా కలుపు బెడద ఎక్కువగా ఉన్నచోట కలుపు మొక్కలను పూర్తిగా తిరగ తిప్పడానికి లేదా పంట అవశేషాలు ఉండే పొలాన్ని బాగా పొడి చేయడానికి, మరీ బంకమన్ను ఉన్న పొలంలో నాణ్యమయిన పొలంలో తయారికి నిర్ణీత రెక్కను మార్చి అధిక ఫలితాన్ని పొందవచ్చును. ఇలా చేయడం వలన పనిముట్లకు వాడే ఎడ్లు లేదా ట్రాక్టర్ల శక్తి సామర్థ్యాలను సమర్ధవంతంగా వాడవచ్చును. చల్కా భూములలో పై పొర గట్టిపడినప్పుడు ఈ పనిముట్టు బాగా ఉపయోగపడుతుంది. 35 హెచ్.పి. ట్రాక్టరుతో ఈ పరికరాన్ని వాడి రెండు గంటలలో 1 - 1.5 ఎకరాలను దున్నవచ్చును.

3. పళ్ళెపు నాగలి (Disc Plough) : ఇందులో సుమారు 60 సెం.మీ. నుండి 90 సెం.మీ. వరకు వ్యాసం కలిగి గుంతగా ఉన్న రెండు లేదా మూడు పళ్ళాలను ప్రత్యేక రీతిలో విడివిడిగా తిరిగేందుకు వీలుగా ఒక ఛట్రానికి అమర్చి నేలను దున్నేందుకు వీలుగా వుంటుంది. ఇలా తిరిగే నాగలి పళ్ళాలు ఉండడం వలన ఏ విధమైన ఆటంకము ఎదురైనప్పటికీ ఈ పళ్ళెపు నాగలిని ఉపయోగించవచ్చు.

రెక్క నాగలిని ఎక్కడైతే సమర్ధవంతంగా ఉపయోగించలేమో అటువంటి నేలలో కూడా ఈ పళ్ళెపు నాగలిని సమర్ధవంతంగా వాడవచ్చును. అంతే కాకుండా నేలంతా రాళ్ళమయమై ఉన్నప్పుడు లేదా మొక్కల వేళ్ళు అవశేషాలు పొదిగి ఉన్నప్పుడు లేదా ఇసుక నేలల్లో కూడా పళ్ళెపు నాగలిని సమర్ధవంతంగా వాడవచ్చును. ఈ పళ్ళెపు నాగలి ముఖ్యంగా బరువును పెంచి నిర్ణీత లోతు వరకు దున్నవచ్చును. కాకపోతే దీనిలో పళ్ళాలతో దున్ని మట్టిని ప్రక్కకు నెట్టడం వలన పొలమంతా పెద్దపెద్ద గడ్డలతో ఎత్తు పల్లాలుగా తయారవుతుంది. పొలంలో ఏర్పడ్డ ఈ ఎత్తు పల్లాలను సమర్ధవంతమయిన దంతుల ద్వారా నేలను బాసినపుడు మట్టి గడ్డలు పొడి అయిపోయి నేల చదునుగా తయారవుతుంది. అట్లుకాక ఈ ఎత్తుపల్లాలకు భయపడి రైతాంగం నేల దున్నడం మాని ఏ విధంగాను ఉపయోగపడని కల్టివేటరును వాడటం వలన నేలను దున్నినామన్న భ్రమలో రైతులు చాలా నష్టపోతున్నారు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# నేటి వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత



శ్రీమతి జె. శశికళ, వ్యవసాయ అధికారి, జిల్లా వనరుల కేంద్రం, చిత్తూరు




సమగ్ర ఎరువుల యాజమాన్యంలో సేంద్రియ ఎరువులు ఒక భాగం. పైర్లకు కావలసిన పోషక పదార్థాలను అందించడానికి ఎరువులు వేయాలి.

మొక్కలు, జంతువులు, మానవుల అవశేషాలనుండి తయారయ్యే వాటిని సేంద్రియ ఎరువులు అంటారు. ఇంతకు ముందు రైతులు సేంద్రియ ఎరువుల మీదనే ఆధారపడి వ్యవసాయం చేసేవారు. కానీ ఇటీవల సేంద్రియ ఎరువుల వాడకం బాగా తగ్గిపోయింది.

## సేంద్రియ ఎరువులు – ఉపయోగాలు :

సేంద్రియ పదార్థం నేల భౌతిక లక్షణాలను మెరుగు పరుస్తుంది. బరువు నేలలు గుల్లబారి వేళ్ళు చక్కగా పెరగడానికి సహాయ పడుతుంది. నీరు ఇంకడం పెరిగి మురుగు సౌకర్యం మెరుగవుతుంది. ఇసుక నేలల్లో మట్టి రేణువుల అమరికను క్రమబద్ధం చేస్తుంది. నీటిని గ్రహించి తేమను ఎక్కువ కాలం పట్టి పెట్టుకొనే శక్తి పెరగడానికి దోహదపడుతుంది. బెట్ట పరిస్థితిని తట్టుకొనే శక్తి పెరుగుతుంది. నేలలోని పోషకాలను మొక్కలు గ్రహించడానికి ఉపయోగపడే సూక్ష్మ జీవులకు ఆహారంగా పనికివస్తుంది. సేంద్రియ పదార్థం బాగా చివికి ఏర్పడిన హ్యూమస్ పోషకాలను పట్టి ఉంచి మొక్కకు అందిస్తుంది. ఆమ్ల మరియు క్షార నేలల్లో హానికరమైన లక్షణాలను తగ్గిస్తుంది. చౌడు భూములకు సేంద్రియ ఎరువులు బాగా పనికివస్తాయి.

## సేంద్రియ ఎరువులు – రకాలు :

సేంద్రియ ఎరువులను ముఖ్యంగా రెండు రకాలుగా విభజించవచ్చు.

1. స్థూల సేంద్రియ ఎరువులు, 2. చిక్కటి సేంద్రియ ఎరువులు

**స్థూల సేంద్రియ ఎరువులు :** పశువుల ఎరువు, కంపోస్టు, కోళ్ళు, మేకలు, పంది ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, పచ్చి ఆకు ఎరువులు, చెరకు మడ్డి, వర్మీ కంపోస్టు వున్నాయి. స్థూల సేంద్రియ ఎరువుల్లో పోషకాలు తక్కువ పరిమాణంలో వున్నా నేల ఫలదత, భౌతిక లక్షణాలపై మంచి ప్రభావం చూపిస్తాయి.

**పశువుల పేడ ఎరువు :** రైతులు ఉపయోగించే ముఖ్యమైన ఎరువు. పశువుల కొట్టం దగ్గర గొయ్యి తీసి అందులో పశువుల పేడ, మూత్రంతో తడిసిన చెత్త, పశువులు తినగా మిగిలిన గడ్డి వేసి, పేడ బురదతో కప్పితే 3–4 నెలలకు బాగా చివికి మంచి సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎండకు ఎరువు ఎండకుండా, వానకు తడవకుండా మట్టితో కప్పడం వల్ల పోషకాలు నష్టం కావు.

**బయోగ్యాస్ :** పశువుల పేడ నుండి ఇంధనానికి వాడుకోగా మిగిలిన పేడ మంచి సారవంతమైన సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. దీనిలో 2–2.4% వరకు నత్రజని వుంటుంది.

**కంపోస్టు ఎరువు :** గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే చెత్త, రాలిన ఆకులు, కలుపు మొక్కలు, కుళ్ళిన కూరగాయలు, పండ్లు వేరు శనగ పొట్టు మొదలైనవి ఉపయోగించి నాణ్యమైన కంపోస్టు తయారు చేస్తున్నారు. అలాగే పట్టణాలలో నిత్యం సేకరించే వేలాది టన్నుల వ్యర్థాలను సరైన పద్ధతిలో చివికేటట్లు చేయడం వలన



"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



పట్టణ కంపోస్టు తయారవుతుంది. దీని ప్రాముఖ్యతను గుర్తించి అనేక మునిసిపాలిటీలు, కార్పోరేషన్లు పెద్దఎత్తున కంపోస్టు తయారు చేస్తున్నాయి.

**కోళ్ళ ఎరువు :** కోళ్ళ ఫారాలు వున్నచోట షెడ్‌లో కోళ్ళ క్రింద వేసిన పొట్టు, మలమూత్రాలతో కలిసి చివికి మంచి సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. కోళ్ళ ఎరువు బాగా చివికిన తర్వాతే వాడుకోవాలి. కోళ్ల ఎరువులో సూక్ష్మ పోషకాలు కూడ వుండి పైర్లకు ఉపయోగపడతాయి.

**గొర్రెలు / మేకల ఎరువు :** ఈ జీవాలను సాధారణంగా ఎండాకాలంలో నేరుగా పొలంలోనే మంద కట్టడం అలవాటుగా వస్తోంది. మందకట్టడం, పూర్తికాగానే పొలాన్ని ఒకసారి దున్నితే ఎరువు నెలలో కలిసిపోయి పోషకాలు వృద్ధా కాకుండా ఉపయోగపడతాయి. దొడ్లలో వచ్చిన ఎరువును పశువుల ఎరువులాగానే వాడుకోవచ్చు.

**పచ్చి రొట్ట ఎరువులు :** అందుబాటులో కాలువగట్లు, పొలంగట్లు, బంజరు భూములు, అడవి ప్రాంతాల్లో పెరిగే అన్ని రకాల మొక్కల నుండి పచ్చి ఆకులు సేకరించి పొలంలో వేసి ఎరువుగా వాడటాన్ని పచ్చి ఆకు ఎరువు అంటారు.

**చెరకు మడ్డి :** చెరకు ఫ్యాక్టరీ నుండి వ్యర్థ పదార్థంగా లభించే చెరకు మడ్డిలో మొక్కలకు కావలసిన అన్ని పోషకాలు దొరుకుతాయి. ఒక టన్ను చెరకు మడ్డి రెండు టన్నుల పశువుల ఎరువుకి సమానం. చెరకు మడ్డి చౌడు భూములను బాగు చేయడానికి కూడా ఉపయోగపడుతుంది.

**వర్మి కంపోస్టు :** వానపాములు (ఎర్రలు) ఉపయోగించి తయారు చేసే ఎరువును వర్మీ కంపోస్టు అంటారు వర్మి కంపోస్టు బెడ్స్ తయారు చేసి తొందరగా కుళ్ళే వ్యర్థాలతో నింపి అందులో వానపాములను వదిలితే 2 - 2 1/2 నెలల్లో మంచి ఎరువు తయారవుతుంది.

**చిక్కటి సేంద్రియ ఎరువులు :** గింజల నుండి నూనె తీసివేయగా మిగిలిన పదార్థం ఎరువుగా ఉపయోగపడుతుంది. వేరువనగ చెక్క, నువ్వుల పిండి, ఆరపిండి, ఆముదం పిండి, కానుగ పిండి మొదలైనవి. వీటితో పాటు రక్తపు పొడి, చేపల పొట్టు వంటి వాటిని కూడా వాడవచ్చు. వీటినే మనం చిక్కటి సేంద్రియ ఎరువులు అంటాము. వీటిలో పోషకాలు కూడా ఎక్కువ వుంటాయి.



కాబట్టి రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్యంలో భాగంగా తమకు అందుబాటులో వున్న సేంద్రియ ఎరువులను విరివిగా వాడి భూసారం పెంచడమే కాక, రసాయన ఎరువులపై పెట్టే ఖర్చును తగ్గించుకోవాలి.




“చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి.”

# వేరుశనగలో సరైన మొక్కల సాంద్రత పాటించాలి



శ్రీ ఎం.వి.శ్రీకాంత్, ఏ.డి.ఏ., జిల్లా వనరుల కేంద్రం, చిత్తూరు.




ఖరీఫ్ లో వర్షాధారంగా సాగుచేసే వేరుశనగలో సరైన మొక్కల సాంద్రత పాటించకపోవడం వల్ల ఆశించిన దిగుబడిని రైతాంగం పొందలేకపోతున్నారు. ఖరీఫ్ లో ఒక చదరపు మీటరుకు సిఫారసు మేరకు 33 మొక్కలు ఉండాలి. కానీ అధికశాతం రైతుల పొలాల్లో సరాసరిన 25 మొక్కలు మాత్రమే ఉంటున్నాయి. దీనికి గల కారణాలు తక్కువ విత్తన మోతాదు వాడటం, సిఫారసు చేసిన దూరంలో విత్తుకోకపోవడం, ముందుగా మొలకశాతం పరీక్షించుకోకపోవడం మరియు విత్తనశుద్ధి చేయకపోవడం.

మంచి దిగుబడినిచ్చే కె6, ధరణి లాంటి రకాలను ఖరీఫ్ లో వర్షాధారంగా సాగుచేసినపుడు ఎకరానికి 60 కిలోల విత్తనాలు వాడాలి. ఇందుకోసం సుమారుగా 90 కిలోల విత్తనకాయలు కావాలి. రెండు వరుసల మధ్య 30 సెంటీ మీటర్ల దూరం, అలాగే వరుసలో మొక్కల మధ్య 10 సెంటీ మీటర్ల దూరం ఉంచి విత్తుకోవాలి. ఈ సిఫారసు దూరంలో విత్తినపుడు ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు ఉంటాయి. అంటే ఎకరానికి ఒక లక్షా, ముప్పైరెండువేల మొక్కలు ఉంటాయి. కోత వరకు ఈ మొక్కలన్నీ బతికే పరిస్థితి ఉండకపోవచ్చు. పురుగులు, తెగుళ్ళు ఆశించడం వల్ల, బెట్ట పరిస్థితుల వల్ల కొన్ని మొక్కలు చనిపోతాయి. కోత సమయంలో చదరపు మీటరుకు కనీసం 25 మొక్కలు ఉన్నా మంచి దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్తలు తెలియజేస్తుంటారు. పంట తొలిదశలోనే కేవలం 25 మొక్కలు ఉంటే, కోత సమయానికి వాటిలో మరిన్ని మొక్కలు తగ్గి నామమాత్రపు దిగుబడి పొందుతున్నారు. ఎన్ని మేలైన యాజమాన్య పద్ధతులు పాటించినప్పటికీ సరైన మొక్కల సాంద్రత లేకపోతే ఎక్కువ దిగుబడి పొందలేము. (గమనిక: కదిరి లేపాక్షి రకానికి సిఫారసు చేసిన దూరం 30 x 15 సెంటీ మీటర్లు.)

**మొలక పరీక్ష :** సేకరించిన విత్తనాన్ని ముందుగా విత్తన మొలక పరీక్ష చేసి మొలకశాతం తెలుసుకోవాలి. పేపరు పద్ధతిలో గానీ, ట్రే పద్ధతిలో గానీ 100 విత్తనాలను మొలక పరీక్ష చేయాలి. వేరుశనగ విత్తనాలకు నిర్ధారించిన కనీస మొలకశాతం 70 శాతం. మొలకశాతం బాగుంటే పొలంలో మొక్కల సాంద్రత కూడా బాగుంటుందని ముందుగానే తెలుసుకోవచ్చు.

**విత్తనశుద్ధి :** విత్తిన తరువాత నేల ద్వారా లేదా విత్తనం ద్వారా ఆశించే తెగుళ్ల వలన మొలకదశలోనే విత్తనాలను నష్టపోయే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు మొదలుకుళ్ళు ఆశించడం వలన విత్తిన తరువాత మొలక రాకుండానే విత్తనం కుళ్ళి పోతుంది.




“సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి”

## మొలక పరీక్ష చేసుకుందాం.. మొక్కల సాంద్రత ముందే తెలుసుకుందాం..



ఒక విత్తనం తగ్గితే అక్కడ ఒక మొక్క పోయినట్లే. కాబట్టి విత్తిన ప్రతి విత్తనమూ ఆరోగ్యంగా మొలకెత్తడానికి విత్తనశుద్ధిని విధిగా పాటించాలి. రసంపీల్చు పురుగుల బారి నుంచి, మొదలుకుళ్ళు, వేరుకుళ్ళు లాంటి తెగుళ్ల నుంచి మొక్కలను కాపాడుకోవడానికి సిఫారసు చేసిన మందులతో, సిఫారసు చేసిన మోతాదులో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. 'ఇమిడాక్లోప్రిడ్' అనే మందును కిలో విత్తనానికి 2 మి.లీ.ల చొప్పున కలిపి విత్తశుద్ధి చేసి, ఆరిన తరువాత కిలో విత్తనానికి ఒక గ్రాము 'టెబుకోనజోల్

2 డి.యస్' (లేదా) 3 గ్రాముల 'మాంకోజెబ్' మందును కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. 'ట్రైకోడెర్మా విరిడి' లాంటి జీవశిలీంధ్రనాశని మందు లభ్యమైతే కిలో విత్తనానికి 10 గ్రాములు చొప్పున కలిపి విత్తుకోవాలి. మొదలుకుళ్ళు, వేరుకుళ్ళు, కాండం




కుళ్ళు వంటి తెగుళ్ల బెడద కాపాడటానికి 'టి. విరిడి' ఉపయోగపడుతుంది.

**విత్తనగొర్రు వాడకం:** సీడ్ డ్రిల్ లాంటి పరికరంతో వేరుశనగ విత్తనాలను విత్తుకోవడం వల్ల సిఫారసు చేసిన దూరంలో విత్తడం సాధ్యమవుతుంది. తక్కువ సమయంలోనే విత్తుకోవచ్చు. విత్తనాన్ని 5 సెంటీ మీటర్ల లోతు లోపలే విత్తుకోవచ్చు. నిర్దిష్ట దూరంలో వరుసలలో విత్తుకోవడం వల్ల కలుపు యాజమాన్యం కూడా సులభంగా చేపట్టవచ్చు. జిప్సం లాంటి ఎరువులను పూతదశలో పైపాటుగా చాళ్ళలో వేసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయడానికి అనువుగా ఉంటుంది.

'విత్తన గొర్రు' వాడి సరైన దూరంలో, సరైన లోతులో విత్తనాలు విత్తుకోవాలి.



చదరపు మీటరుకు 33 మొక్కల సాంద్రత పాటించినపుడు రసంపీల్చు పురుగైన, తామరపురుగుల తాకిడి కూడా బాగా తగ్గుతుంది. దీని వల్ల వేరుశనగ పంటను మొవ్వకుళ్ళు వైరస్ తెగులు, కాండం కుళ్ళు వైరస్ తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకొనే అవకాశం ఉంటుంది. కంచె పంటగా 4-5 వరుసలలో జొన్న, మొక్కజొన్న లాంటి పంటలు వేయడంతో పాటూ సరైన మొక్కల సాంద్రత పాటించడం ద్వారా ఈ తామరపురుగుల నష్టాన్ని తగ్గించవచ్చు. వర్షాధార వేరుశనగలో విత్తేముందు మరియు విత్తే సమయంలో పైన తెలిపిన మెళకువలను పాటించడంతో పాటూ సరైన ఎరువులు, కలుపు యాజమాన్యం చేపట్టడం ద్వారా ఆశించిన దిగుబడులు పొందవచ్చు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."



రైతు భరోసా విడుదల సందర్భంగా ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రివర్యులు







ధాన్యం రైతుకు మద్దతు ధర : కళ్లాల వద్దే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు, చెల్లింపు



మత్స్యకారుడికి మద్దతు :

1,19,875 మంది మత్స్యకారులకు రూ. 10,000 చొప్పున రూ. 119.88 కోట్ల ప్రయోజనం

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"





రైతు విత్తనం రైతుకే : రైతు భరోసా కేంద్రాల వద్ద నాణ్యమైన వేరుశనగ విత్తన పంపిణీ



ముస్తాబు : ప్రారంభానికి సిద్ధమవుతున్న ఆర్.బి.కే. భవనం



సాగుకు సన్నద్ధత : వ్యవసాయ సలహా మండలి సమావేశం



పారదర్శకతకు ప్రాధాన్యం : లబ్దిదారుల జాబితా ప్రదర్శన



ముందస్తు సన్నాహం : ఆర్.బి.కే.లో ఎరువుల నిల్వ

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఖరీఫ్ కంది సాగులో అధిక దిగుబడులకు యాజమాన్య పద్ధతులు



డా. సీ.హెచ్. వరప్రసాద రావు, ప్రధాన శాస్త్రవేత్త & సమన్వయ కర్త, డాట్ సెంటర్, దర్శి, ప్రకాశం జిల్లా.



మన రాష్ట్రంలో కంది సుమారుగా 2.46 లక్షల హెక్టార్లలో సాగవుతూ 1.2 లక్షల టన్నుల ఉత్పత్తిని ఇస్తుంది. హెక్టారుకు 504 కిలోల సరాసరి దిగుబడిని ఇస్తుంది. పెసర, ప్రత్తి, మినుము, సోయా చిక్కుడు, వేరుశనగ లాంటి పైర్లతో మిశ్రమ పంటగా కందిని ఖరీఫ్ లో సాగు చేస్తున్నాము. కంది పంటలో రైతులు కొన్ని సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులను ఉపయోగించినట్లయితే మంచి దిగుబడులు పొందుతారు .

**రకాల ఎంపిక:**

**ఎల్.ఆర్.జి 30 (పల్నాడు):** ఈ రకం ఖరీఫ్ లో 170-180 రోజులకు కోతకు వస్తుంది. ఎకరాకు 8-10 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది. ఒకేసారి పూతకు వస్తుంది. పువ్వులు పసుపు పచ్చగా ఉంటాయి.గింజలు మధ్యస్థ లావుగా ఉంటాయి. వెర్రి మరియు ఎండు తెగుళ్ళను తట్టుకోలేదు.

**ఎల్.ఆర్.జి. 41 :** ఈ రకం ఖరీఫ్ లో 180 రోజులకు కోతకు వస్తుంది. ఎకరాకు 8-10 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది. ఒకేసారి పూతకు వస్తుంది. శనగ పచ్చ పురుగును కొంతవరకు తట్టుకుంటుంది. నల్ల రేగడి భూములకు అనుకూలం.నీటి వసతి తో తేలికపాటి భూముల్లో పండించవచ్చును.

**లక్ష్మి (ఐ.సి.పి.ఎల్. 85063) :** ఈ రకం ఖరీఫ్ కాలం లో 160-170 రోజులకు కోతకు వస్తుంది. పంట దిగుబడి ఎకరాకు 7 నుండి 8 క్వింటాళ్ళ వరకు వస్తుంది.మొక్క నిటారుగా పెరిగి ఎండు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. గింజలు లావుగా ముదురు గోధుమ రంగులో ఉంటాయి

**ఆశ (ఐ.సి.పి.ఎల్. 87119) :** ఈ రకం ఖరీఫ్ కాలం లో 170-180 రోజులకు కోతకు వస్తుంది.పంట దిగుబడి ఎకరాకు 7 నుండి 8 క్వింటాళ్ళ వరకు వస్తుంది.మొక్క నిటారుగా పెరిగి ఎండు మరియు వెర్రి తెగుళ్ళను తట్టుకుంటుంది. గింజలు ముదురు గోధుమ రంగులో ఉంటాయి.

**పి.ఆర్.జి 158 :** ఈ రకం ఖరీఫ్ కాలంలో 145-150 రోజులకు కోతకు వస్తుంది.పంట దిగుబడి ఎకరాకు 7 నుండి 8 క్వింటాళ్ళ వరకు వస్తుంది. ఈ రకం ఎండు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. రాయలసీమ ప్రాంతంలోని తేలిక నేలలు, ఎర్ర చల్కా నేలల్లో సాగు చేయడానికి అనువైనది.

**ఎల్.ఆర్.జి 52 :** ఈ రకం ఖరీఫ్ కాలంలో 155-160 రోజులకు కోతకు వస్తుంది.పంట దిగుబడి ఎకరాకు 8-9 క్వింటాళ్ళ వరకు వస్తుంది. ఈ రకం ఎండు మరియు వెర్రి తెగుళ్ళను కొంతవరకు తట్టుకుంటుంది. ప్రక్క కొమ్మలు ఎక్కువగా వస్తాయి. గింజలు లావుగా ఉంటాయి.

**విత్తనశుద్ధి :** ద్రవ రూప రైజోబియంను కిలో విత్తనానికి 5-10 మి.లీ. కలిపి విత్తుకుంటే అధిక దిగుబడులను సాధించవచ్చు. తెగుళ్ళ నివారణకు విత్తుకునే ముందు తప్పని సరిగా కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండిజం మందు పట్టించి విత్తుకోవాలి

**విత్తే దూరము :** నల్ల రేగడి భూముల్లో 150 × 20 సెం.మీ. (వరుసల మధ్య మరియు మొక్కల మధ్య దూరము) ఎర్ర నేలల్లో 90 × 20 సెం.మీ దూరంతో విత్తుకోవాలి.

**ఎరువులు :** ఆఖరి దుక్కిలో ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువు, 8 కిలోల నత్రజని మరియు 20 కిలోల భాస్వరం వేసుకోవాలి.అంతరపంటగా వేసినప్పుడు పైరును బట్టి వేసే ఎరువు మోతాదు మారుతుంది.

**నీటి యాజమాన్యం :** కంది వర్షాధార పంట. సకాలంలో వర్షాలు వచ్చినట్లైతే నీటి తడులు అవసరం ఉండదు. వర్షాలు ఆలస్యం అవుతున్నప్పుడు మొగ్గ రాబోయే ముందు ఒకసారి, కాయ

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

దశలో మరొకసారి రెండు నీటి తడులు అవసరం అవుతాయి.

**కలుపు నివారణ మరియు అంతర కృషి :** కంది విత్తిన వెంటనే గానీ లేదా రెండవ రోజు గానీ ఎకరాకు పెండిమిథాలిన్ 30% కలుపు నాశిని 1.0 - 1.5 లీ. లేదా అలాక్లోర్ 50% 1 లీటరు చొప్పున పిచికారీ చేసుకోవాలి. విత్తిన 30 మరియు 60 రోజులకు గుంటకతో గానీ, గొర్రుతోకానీ అంతర కృషి చేసుకోవాలి. విత్తిన 20-25 రోజులప్పుడు గడ్డి జాతి కలుపు మొక్కలైన ఊద, చిప్పెర మరియు గరిక నివారణకు క్విజలోఫాప్ ఇథైల్ 5% మందును 400 మి.లీ ఎకరానికి 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

**అంతరపంటలు :** తక్కువ కాలపరిమితి కలిగిన మినుము, పెసర, తృణ ధాన్యాలు, వేరు శనగ పంటలను అంతర పంటలుగా వేసుకోవచ్చును. కంది మొక్కజొన్న (1:2), కంది/పెసర/మినుము/ సోయా చిక్కుడు/ వేరుశనగ పంటలను 1:7 నిష్పత్తులలో వేసుకోవాలి.

## కందిలో ముఖ్యమైన పురుగులు, తెగుళ్ళు యాజమాన్య పద్ధతులు:

**కాయ తొలుచు పురుగు/ శనగ పచ్చ పురుగు :** ఈ పురుగు పూత, పిందె దశలలో కాయలకు రంధ్రాలు వేసి గింజలను తింటూ ఒక కాయ నుండి మరొక కాయకు ఆశిస్తుంది. ఈ పురుగు తక్కువగా ఆశించే పంటలైన జొన్న , సోయా చిక్కుడు, నువ్వులు, ఉలవలు, మినుము వంటి పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పైరు విత్తిన 90-100 రోజుల్లో చిగుళ్ళను ఒక అడుగు మేర కత్తిరించుకోవాలి. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉనికిని గమనించి తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. పురుగు గ్రుడ్లను, తొలిదశ పురుగులను గమనించగానే 5% వేపగింజల కషాయాన్ని లేదా వేపనూనెను గానీ పిచికారీ చేసుకోవాలి. ఎకరాకు 200 లార్వాలకు



సమానమైన యన్.పి.వి ద్రావణాన్ని లేదా 400 గ్రాముల బాక్టీరియా సంబంధమైన మందులను 200 లీ. నీటిలో కలిపి వారం రోజుల తేడాతో రెండు సార్లు సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలి. చెట్ల క్రింద దుప్పట్లను వేసి, చెట్లను బాగా కుదిపినట్లైతే పురుగులు దుప్పట్ల మీద పడుతాయి. అలా పడిన పురుగులను నాశనం చెయ్యాలి. పైరు మొగ్గ దశలో ఉన్నప్పుడు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ, పూత లేదా పిందెదశలో ఉన్నప్పుడు ఎసిఫేట్ 1.5 మి.లీ లేదా లామా సైహలోత్రిన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ మందులు వాడిన తర్వాత కూడ పురుగును నివారించలేక పోతే థయోడికార్బ్ 1.0 గ్రా. లేదా ఇండాక్సికార్బ్ 1.0. మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**మారుకా మచ్చలపురుగు :** ఈ పురుగును వాడుక భాషలో పూత పురుగు లేదా గూడు పురుగు లేదా బూజు పురుగు అంటాము. తరువాత దశలలో లేత ఆకులను, పూతను, పిందెను మరియు కాయలను కలిపిగూడుగా చేసుకుని కాయ అడుగు భాగాన ఒక చిన్న రంధ్రం చేసుకుని వెళ్ళి కాయలోని గింజలను తినివేసి కాయలను డొల్లగా చెస్తుంది. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ/ ఎసిఫేట్ 1.5 మి.లీ/ థయోడికార్బ్ 1.0 గ్రా/ నోవాల్యూరాన్ 1.0 మి.లీ/ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ./ ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**కాయ ఈగ :** ప్రస్తుత కాలంలో కాయ ఈగ కూడా కంది పంటకు ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. తల్లి పురుగు లేత పిందెలపై గ్రుడ్లు పెడుతుంది. కనుక పిందె దశలో 5% వేపగింజల కషాయాన్ని లేదా వేపనూనెను గానీ పిచికారీ చేసుకోవాలి. గింజ గట్టి పడే దశలో మోనోక్రోటోఫాస్1.6 మి.లీ/ డైమిథోయేట్ 2.0 మి.లీ/ ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**ఎండు తెగులు :** ఈ తెగులు సోకిన మొక్కలు పూర్తిగా కానీ మొక్కలో కొంత భాగం కానీ ఎండిపోయి వాడిపోతాయి. ఎండిన మొక్కలను పీకి కాండం చీల్చి చూసినట్లయితే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. తెగులును తట్టుకునే రకాలైన ఐ.సి.పి.యల్. 87119 లేదా యల్.ఆర్.జి. 52 రకాలను సాగు చేసుకోవాలి. ఈ తెగులు నివారణకు వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి. విత్తుకునే ముందు తప్పని సరిగా కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండిజం మందుతో పట్టించి విత్తుకోవాలి. విత్తుకునే సమయం లో 80 కిలోల చివికిన పశువుల ఎరువు, 20 కిలోల వేపపిండి లో అభివృద్ధి పరచిన 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి జీవ నియంత్రణ శిలీంద్రాన్ని భూమిలో కలుపుకుంటే ఎండు తెగులు ను నివారించుకోవచ్చును

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# పసుపు సాగులో కీలక యాజమాన్య పద్ధతులు

**డా. పి. నాగిరెడ్డి,** శాస్త్రవేత్త (ఉద్యాన విభాగం), టి. స్వామి చైతన్య, శాస్త్రవేత్త (వాతావరణ విభాగం),
**డా. ఎ. వీరయ్య,** ప్రోగ్రాం కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, కడప జిలా



ఈ సంవత్సరం పసుపు ధర రైతుకు ఆశాజనకంగా ఉన్నందువల్ల రానున్న మాసంలో రైతులు పసుపును అధిక విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉన్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పసుపు పంట 23,489 హెక్టార్లలో సాగుచేయబడుతూ 1,66,326 టన్నుల దిగుబడి నమోదు చేయబడినది. కడప, కర్నూలు, గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లో పసుపును అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. అధిక కుర్కుమిన్ శాతం గల పసుపు రకాలకు మంచి మార్కెట్ ఉన్నది.

పసుపు సాగుకు తేమతో కూడిన వేడి వాతావరణం అనువైనది. వర్షపాతం 1200-1400 మి.మీ ఉండి నీటి వసతి ఉన్న ఏ ప్రాంతంలోనైనా పండించవచ్చు. పసుపు మొలకెత్తేటప్పుడు 25-35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అవసరం.

పసుపు పండించడానికి బలమైన నేలలు శ్రేష్టమైనవి. గరప నేలలు మరియు మురుగు నీటి పారుదల సౌకర్యం గల ఇతర నేలలు అనుకూలం. ఉదజని సూచిక 5-7.5 మధ్య ఉండి సేంద్రియ కర్బనం ఎక్కువగా ఉన్న నేలల్లో పసుపు బాగా పండుతుంది.

పసుపు స్వల్ప కాలిక రకాలను మే చివరి వారంలో, మధ్య కాలిక రకాలను జూన్ మొదటి పక్షంలో దీర్ఘ కాలిక రకాలను జూన్ రెండవ పక్షంలో విత్తుకోవచ్చు. జూలై రెండవ పక్షం తర్వాత నాటినట్లయితే దిగుబడి చాలా తగ్గుతుంది. కావున సరైన సమయంలో విత్తు కోవాలి. విత్తన రకాలను ఆరోగ్యవంతమైన బలమైన మొక్కల నుండి ఎంపిక చేసుకోవాలి. తల్లి కొమ్ములను, పిల్ల కొమ్ములను నాటటానికి వినియోగించవచ్చు. 6-8 సెం.మీ పొడవుతో దృఢంగా ఉండే మొలకెత్తు మొగ్గలున్న పిల్ల కొమ్ములు అనువుగా ఉంటాయి. అయితే 20-30 గ్రా. బరువు ఉండి, ఆరోగ్యంగా ఉన్న చిల్లకొమ్ములు కూడా తల్లి కొమ్ములతో సమానంగా దిగుబడులు ఇవ్వగలవని పరిశోధనల ద్వారా దృవీకరించడమైనది. విత్తే లోతు 8 లేక 12 సెం.మీ ఉన్న యెడల దృఢంగా మంచి ఎదుగుదల గల మొక్కలను పొందవచ్చు. విత్తనపు దుంపలుగా తల్లి కొమ్ములు వాడినప్పుడు దిగుబడులు ఎక్కువగా ఉంటాయి. ఎకరాకు 1000 కిలోల విత్తనం కావాలి.

**పసుపులో దీర్ఘకాలిక రకాలు :** మైదుకూరు, టేకూరిపేట, సి.యల్.యల్ -326, ఆర్మూర్, దుగ్గిరాల (గుంటూరు ఎరుపు), కె.టి.యు.స్ -3(సిఎ-21ఎ) దుగ్గిరాల తెలుపు/లావణ్య, కె.టి.యు.స్-8.

**పసుపులో మధ్యకాలిక రకాలు :** సి.యల్.ఐ-317, అమృతపాణి, కొత్తపేట, ప్రతిభ, నరేంద్రహల్దీ-98 (ఎన్.డి.హెచ్ -98).

**పసుపులో స్వల్పకాలిక రకాలు :** కస్తూరి,సుగుణ (పి.సి.టి-13), రాజేంద్ర సోనాలి,సుదర్శన (పి.సి.టి-14), ప్రగతి (ఎ.సి.సి.-48), సుగంధశ్రీ.

**నేలతయారి :** వేసవిలో భూమిని లోతుగా గుల్లగా దున్నాలి. దుక్కి బాగా మెత్తగా ఉండాలి. 6-8 సార్లు దున్ని ఆఖరి దుక్కిలో ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు అంతే మోతాదులో చెరువు మట్టికూడా వేసి కలియదున్నాలి.

**విత్తనశుద్ది :** విత్తనశుద్దిని రెండు సార్లు చేసుకోవచ్చు. మొదటిసారి విత్తనశుద్ది చేసుకుని ఆరబెట్టిన తరువాత నీడ ప్రదేశంలో కుప్పలుగా పోసి నిలువ ఉంచుకోవాలి. రెండవ సారి విత్తనశుద్ది నాటేటప్పుడు చేసుకోవాలి. విత్తనశుద్ది చేసేటప్పుడు మొలక విరగకుండా జాగ్రత్త వహించాలి. ఒకేసారి చేయాలనుకుంటే విత్తనం ఎంపిక చేసుకుని శుద్ధి చేసి నిలువ ఉంచుకోవడమే మంచిది. దీని కొరకు బలమైన, మొలకెత్తిన మొగ్గల గల పిల్ల కొమ్ములను ఎంచుకోవాలి. లీటరు నీటికి 3.0 గ్రాములు మెటలాక్సిల్ లేదా 3.0 గ్రాములు మాంకోజెబ్ కలిపిన ద్రావణంలో 40 నిమిషాల పాటు ఉంచి, బయటకు తీసి, నీడలో ఆరబెట్టి తరువాత నాటుకోవాలి. విత్తన పసుపుకు పొలుసు పురుగులు ఆశించి ఉంటే శిలీంద్రనాశినితో

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

పాటు లీటరు నీటికి 3-5 మి.లీ. మలాథియాన్ లేదా 2.0 మి.లీ మోనోక్రోటోఫాస్ మందు కలిపితే మంచిది. తరువాత వీటిని ఆరబెట్టి నీరు మార్చి లీటరు నీటికి 5.0 గ్రా.ల ట్రైకోడెర్మావిరిడి చొప్పున కలిపి ఆ ద్రావణంలో దుంపలను ముంచి ఆరబెట్టాలి.

**నాటే పద్ధతులు : 1.ఎత్తు మడుల పద్ధతి :** ఈ పద్ధతిలో మీటరు వెడల్పు, మడికి మడికి మధ్య 30 సెం.మీ వెడల్పు కాలువ ఉండేటట్లు ఎత్తు మడులు తయారు చేసుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ దుంపల మధ్య 15 సెం.మీ. ఎడం ఉండేలా నాటుకోవాలి. ఈ పద్ధతిలో దుంపకుళ్ళు తక్కువగా ఉంటుంది.

**2. సమతుల మడుల పద్ధతి :** ఈ పద్ధతిలో 30 సెం.మీ. దూరంలో మడకసాలు చేసి అందులో 15 సెం.మీ. ఎడంలో విత్తనం వేసి సాళ్ళను చదును చేసి 3.0 మీ పొడవు, 1.5-2.0 మీ వెడల్పు గల మడులు చేయవచ్చు. కయ్యల మధ్య నీటి కాలువ చేసి దాని గుండా నీటిని పారిస్తారు. ఈ పద్ధతి వల్ల దుంపకుళ్ళు వచ్చే ఆస్కారం ఎక్కువ కాబట్టి మురుగు నీటి సౌకర్యం కల్పించాలి.

**3. బోదెసాళ్ళ పద్ధతి :** ఈ పద్ధతిలో 45-60 సెం.మీ ఎడం ఉండే విధంగా బోదెలు తయారు చేసుకుని ఆ బోదెల మీద 20 సెం.మీ ఎడం ఉంచి దుంపలు నాటుకోవాలి. రెండు వరుసల మధ్య ఉన్న సాలు ద్వారా నీరు అందించడం వలన బోదె నీటిని పీల్చుకుంటుంది. మొక్క వేర్లు, దుంప నీటిలో ఉండవు. కనుక దుంపకుళ్ళు తక్కువగా ఆశిస్తుంది.

**అంతర పంటలు :** పసుపులో మొక్కజొన్న, ఆముదం సాగు లాభంగా ఉంటుంది. అముదంను అంతర పంటగా 10-12 పసుపు సాళ్ళకు ఒక వరుస చొప్పున నాటవచ్చు. మొక్కజొన్న లేదా ఆముదం పంటలను అంతర పంటలుగా వేసినపుడు రెండు పంటలకు సిఫారసు చేసిన ఎరువులు వేయాలి. పసుపును కొబ్బరి, మామిడిలో అంతర పంటగా సాగుచేయవచ్చు. పసుపును మామిడిలో అంతర పంటగా పెంచుటకు 20 సెం.మీ దూరంలో నాటిన యెడల అధిక దిగుబడులను పొందవచ్చు. పి.టి.యస్ - 43, ప్రభ అను రకాలు అంతర పంటలుగా అనుకూలమైనవి.





**అంతరకృషి :** దుంపలు నాటిన 40-45 రోజులకు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి. నేల మరియు కలుపు ఉధృతి బట్టి పంట కాలంలో 3-4 సార్లు నాటిన 60,90,120 మరియు 150 రోజులకు పలు దఫాలుగా కలుపు తీయించాలి.

**ఎరువులు :** పసుపులో అధిక దిగుబడులు పొందుటకు రసాయనిక ఎరువులతో పాటు 4 టన్నుల వర్మీకంపోస్ట్, ఒక ఎకరాకు వేసిన యెడల నేల స్వభావాన్ని వృద్ధిచేసి, కార్బన్ శాతం పెంచడం వలన దుంప పెరుగుదల బాగుంటుంది. పసుపు పంటకు ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు 10 టన్నులు, ఆముదపు లేదా వేప పిండి 200 కిలోలు, జింక్ సల్ఫేట్ 10 కిలోలు ఒక ఎకరాకు వేయాలి. నాటిన 40 రోజులకు సూపర్ ఫాస్ఫేట్ 150 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 25 కిలోలు, వేపపిండి 200 కిలోలు , యూరియా 50 కిలోలు వేయాలి. నాటిన 80 రోజులకు యూరియా 50 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 25 కిలోలు, నాటిన 120 రోజులకు యూరియా 50 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 25 కిలోలు వేయాలి. పసుపు పంటకు పైపాటుగా వేసే యూరియా, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఆకులపై వర్షపు నీటి బొట్లు, మంచు తేమ లేనప్పుడు వేయాలి.

**మల్చింగ్ :** కాలువల మధ్య జీలుగ, జనుము, వెంపలి, సీమకానుగ, దిరిసిన, కానుగ, గ్లైరిసీడియా లాంటి భూమిని పచ్చి ఆకులు లేదా ఎండుటాకులతో కప్పి ఉంచాలి. దీనివల్ల పసుపు బాగా మొలకెత్తడమే కాక కలుపు పెరగదు. నేలలో తేమ త్వరగా ఆరిపోదు. ఆకుల ద్వారా సేంద్రియ పదార్థం నేలకు అందడమే కాకుండా ప్రధాన మరియు సూక్ష్మపోషకాలు కూడా పైరుకు అందుతాయి. దీని వలన దిగుబడులు, నాణ్యత పెరుగుతాయి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# వర్షాకాలంలో కోకో తోటలలో మేలైన యాజమాన్య పద్ధతులు

**డా॥ యం. తిరుపతి రెడ్డి,** ప్రధాన ఉద్యాన పరిశోధనా స్థానం, విజయరాయి
**డా॥ యం. మాధవి లత,** సీనియర్ శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధనా స్థానం, విజయసాయి
**డా॥ ఆర్.వి.యస్.కె. రెడ్డి,** పరిశోధన సంచాలకులు, డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం



**1. నీడనిచ్చే తోటల ఎంపిక / నీడ యాజమాన్యం :** లేత మొక్కలు నేరుగా పడే ఎండను తట్టుకోలేవు. లేత మొక్కలకు తగినంత (40-50%) నీడ కల్పించాలి. అందుకే కోకో తోటలను కేవలం కాపుకొచ్చిన (ఆరు సంవత్సరాలు పైబడిన) కొబ్బరి లేదా ఆయిల్ పామ్ తోటలలో మాత్రమే అంతరపంటగా సాగు చేసుకోవాలి. చతురస్రాకారంలో (8×8 మీ) వున్న కొబ్బరిలో ప్రతి రెండు కొబ్బరి చాళ్ళ మధ్య కేవలం ఒకే వరుసలో మాత్రమే మొక్కకు మొక్కకు మధ్య 3 మీ. ఎడం ఉండే విధంగా కోకో మొక్కలను నాటుకోవాలి. త్రిభుజాకారంలో ఉన్న (9×9 మీ) ఆయిల్ పామ్ తోటలలో ప్రతి రెండు ఆయిల్ పామ్ చాళ్ళ మధ్య కేవలం ఒకే వరుసలో మాత్రమే మొక్కకు మొక్కకు మధ్య 3 మీ. ఎడం ఉండే విధంగా కోకో మొక్కలను నాటుకోవాలి. ఈ విధంగా కొబ్బరిలో హెక్టారుకు 500 కోకో మొక్కలను మరియు ఆయిల్ పామ్‌లో హెక్టారుకు 400 కోకో మొక్కలను నాటుకోవచ్చును.

**2. గుంతలు త్రవ్వుట మరియు మొక్కలు నాటుట :** కొత్తగా కోకో తోటలు వేసే భూములలో దాదాపు 60 ఘ.సెం.మీ. పరిమాణం గల గుంతలను తవ్వుకోవాలి. బాగా ఎండిన గుంతలను పై సగభాగం నుంచి తీసిన మట్టికి 15-20 కి.గ్రా. పశువుల ఎరువును కలిపి నింపాలి. ఈ నింపిన గుంతలలో 4-6 నెలల వయసున్న కోకో మొక్కలను నాటాలి. కోకో మొక్కలను తొలకరి వర్షాలు ప్రారంభమైనప్పటి నుండి నాటుకోవచ్చును. అధిక వర్షపాతం ఉన్న ప్రాంతాలలో కోకో మొక్కలను వర్షాకాలం చివరిలో నాటుకోవాలి. అప్పుడే నాటిన మొక్కలకు ఊతంగా నిటారైన కర్రను మొక్కకు కొంచెం ఎడంగా పాతి పురికొసతో వదులుగా కట్టాలి.

**3. నీటి యాజమాన్యం :** లేత కోకో తోటలలో నీటి పారుదల క్రమం తప్పకుండా చేపట్టాలి. మూడు సంవత్సరాలు అంతకన్నా వయసు పైబడిన తోటలలో, పాదుల పద్ధతిలో అయితే మొక్కకు 175 లీ. నీటిని వారానికి ఒకసారి పారించాలి. బిందు సేద్య పద్ధతిలో అయినట్లయితే మొక్కకు రోజుకి 20 లీ. నీటిని మూడు సంవత్సరాలు అంతకన్నా వయస్సు పైబడిన తోటలలో, రోజుకి 10-12 లీ. నీటిని రెండు సంవత్సరాలు వయస్సు గల తోటలలో, రోజుకి 3-5 లీ. నీటని ఒక సంవత్సరం వయస్సు గల తోటలలో ప్రతిరోజు అందించాలి.

**4. తోటలు నీటి ముంపునకు గురైనప్పుడు తీసుకోవలసిన చర్యలు :** నీటి కుంటలకు దగ్గరగా ఉన్నటువంటి కోకో తోటలలో బఫర్‌లను ఏర్పాటు చేసుకున్నట్లయితే నీటి ముంపు బారి నుండి కాపాడుకోవచ్చు. లోతట్టు ప్రాంతాలలోని కోకో తోటలలో తోట చుట్టూ కందకాలను తవ్వడం ద్వారా నీటి ప్రవాహం వలన భూమి కోతకు గురికాకుండా చేయవచ్చును. నీటి ముంపుకు గురైన కోకో తోటలలో నిలిచిన వరద నీటిని మురుగు కాలువల ద్వారా బయటకు పంపించాలి. గాలులు ఎక్కువగా వీచునటువంటి ప్రాంతాలలోని కోకో తోటల్లో విరిగిన కాండం మరియు ఫ్యాన్ కొమ్మలను పదునైన కత్తి లేదా రంపం సాయంతో కత్తిరించాలి. కత్తిరించిన భాగాలకు 1% బోర్డో మిశ్రమం లేదా 3% కాపర్‌ఆక్సీ క్లోరైడ్ పేస్ట్ పూయాలి. అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలలోని కోకో తోటలలో చెట్ల కాండం, కొమ్మలు, ఆకులు మరియు కాయలపై ఆశించే శిలీంధ్ర తెగుళ్ల నివారణకు 1% బోర్డో మిశ్రమం లేదా 0.3% కాపర్ ఆక్సీక్లోరైడ్‌లను వారం నుంచి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు చెట్లపై పిచికారి చేయాలి. నీటి ముంపునకు గురైన కోకో తోటలలో భూమి ద్వారా వ్యాప్తి చెందే శిలీంధ్ర తెగుళ్ల నివారణకు 1% బోర్డో మిశ్రమం లేదా 0.3% కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని చెట్టుకు 3 లీటర్ల చొప్పున మొదలువద్ద పోసి ముంపుగా తడపాలి. నీటి ముంపునకు గురైన కోకో తోటలలో పిందె పండిపోకుండా ఉండుటకు మరియు కాయ కుళ్ళు తెగులు నివారణకు 1% బోర్డో మిశ్రమం లేదా

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

0.3% కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నీటి ముంపునకు గురైన కోకో తోటలలో చెట్టుకు సంవత్సరానికి సిపారసు చేయబడినటువంటి ప్రధాన పోషకాలలో (ఒక్కో చెట్టుకి 33 గ్రా. నత్రజని, 13 గ్రా. భాస్వరం మరియు 47 గ్రా. పొటాషియం లను ఒక సంవత్సరం వయస్సు గల తోటలలోను, 66 గ్రా. నత్రజని, 27 గ్రా. భాస్వరం మరియు 93 గ్రా. పొటాషియంలను రెండు సంవత్సరాల వయస్సుగల తోటలలోను మరియు 100 గ్రా. నత్రజని, 40 గ్రా. భాస్వరం మరియు 140 గ్రా. పొటాషియం లను మూడు సంవత్సరాలు అంతకన్నా పైబడిన వయస్సుగల తోటలలోను) సగ భాగాన్ని పాదులలో చల్లాలి. ఆకులు పండుబారిన తోటలలో చెట్లపై 0.5% 13:0:45 లేదా 19:19:19 లేదా 20:20:20 N:P:K వంటి నీటిలో కరిగే రసాయన ఎరువులను వారం నుండి పది రోజుల వ్యవధిలో రెండు నుండి మూడు సార్లు పిచికారీ చేయాలి.

**5. పోషకాల యాజమాన్యం :** సిఫారసు చేయబడిన రసాయన ఎరువులలో (మొదటి సంవత్సరం: 33 గ్రా. నత్రజని, 13 గ్రా. భాస్వరం మరియు 47 గ్రా. పొటాషియం, రెండవ సంవత్సరం : 67 గ్రా. నత్రజని, 27 గ్రా. భాస్వరం, మరియు 93 గ్రా. పొటాషియం, మూడవ సంవత్సరం ఆపైన : 100 గ్రా. నత్రజని, 40 గ్రా. భాస్వరం మరియు 140 గ్రా. పొటాషియం) సగ భాగాల్ని జూలై-ఆగష్టు మాసాలలో మొక్కల పాదుల్లో వేసి కలియబెట్టి నీరు పారించాలి. కోకో తోటలలో చిగురుటాకులపై తరచుగా కనిపించే జింక్ మరియు ఇనుపధాతు లోప లక్షణాల నివారణకు చెట్టుకు 25 గ్రా. జింక్ సల్ఫేట్ మరియు 25 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్‌లను పాదులలో వేసి కలియబెట్టాలి. లేకపోయినట్లయితే 0.25% జింక్ సల్ఫేట్ మరియు 0.5% ఫెర్రస్ సల్ఫేట్ ద్రావణాన్ని మొక్కలపై పిచికారి చేయాలి.

**6. కలుపు యాజమాన్యం :** పాదులలో కలుపు లేకుండా చూసుకోవాలి. లేత కోకో తోటలలో మొక్క మొదలు చుట్టూ పాదులు తయారుచేసి ఎండుటాకులతో గానీ లేదా కొబ్బరి డొప్పలతో గానీ మల్చింగ్ చేయాలి.



విత్తనంద్వారా పెంచబడిన కోకో చెట్టు

**7. శిక్షణ మరియు కత్తిరింపులు :** కోకో మొక్కలు సరైన ఆకృతిని సంతరించుకొనుటకుగాను అనగా కొమ్మల వ్యాప్తి గొడుగు ఆకృతిని సంతరించుకొనేలా నియంత్రించుటకు కత్తిరింపులు చేపట్టాలి. కాండంపై వచ్చే చుపాన్‌లను ఎప్పటికప్పుడు తొలగించాలి. మొక్కలు నాటినప్పటి నుండి గొడుగు ఏర్పడేంతవరకు మొక్కపై ఎలాంటి కత్తిరింపులు చేపట్టరాదు. ఒక మొక్కకు కేవలం ఒకే గొడుగు ఉండే విధంగా చూసుకోవాలి. ప్రధాన కాండంపై వచ్చిన ప్రధాన ఫ్యాన్ కొమ్మల సంఖ్యను తగ్గించకూడదు. ప్రధాన ఫ్యాన్ కొమ్మలపై కాండం దగ్గర నుండి 2 అడుగుల వరకు వచ్చిన ప్రక్క కొమ్మలను వాటి మొదలువరకు కత్తిరించాలి. నెలకు తాకిన ప్రధాన ఫ్యాన్ కొమ్మల కొన భాగాలను మాత్రమే కొంతమేర వెనుకకు కత్తిరించాలి. కత్తిరింపులలో భాగంగా ఎండు కొమ్మలు, తెగులు సోకిన కొమ్మలు/ కాయలు మరియు ఎలుకలు/ ఉడుతలు పాడుచేసిన కాయలను వేరుచేసి నాశనం చేయాలి.

**8. సస్యరక్షణ :** కత్తిరింపుల తరువాత 1% బోర్డో మిశ్రమాన్ని లేదా 0.3% కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని మొక్కలపై పిచికారి చేయాలి. కోకో తోటలలో కాపు దశలో పిందె పండిపోకుండా ఉండుటకు మరియు కాయ కుళ్ళు నివారణకు 1% బోర్డో మిశ్రమాన్ని లేదా 0.3% కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని మొక్కలపై పిచికారి చేయాలి. కాండం మరియు ఫ్యాన్ కొమ్మలపై వచ్చు గజ్జి తెగులు నివారణకు 1% బోర్డో మిశ్రమాన్ని గాని లేదా 0.3% కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని గాని ప్రధాన కాండం మరియు ఫ్యాన్ కొమ్మలపై పిచికారి చేయాలి. కోకో కాయలను తొలిచి తినే ఉడుతలు మరియు ఎలుకల నివారణకు 10 గ్రా. బ్రోమాడియోలోన్ 0.005% కేకు ముక్కలను కొమ్మల పంగలలో ఉంచాలి.

**9. కాయ కోత మరియు కోతానంతర యాజమాన్యం:** ముదురు తోటలలో కాయకోత మొదలవుతుంది కనుక బాగా పండిన కాయలను పదునైన కత్తితో పూమెత్త గాయపడకుండా కోయాలి. కోసిన కాయలను మూడు రోజులపాటు గుట్టపోసి మగ్గనివ్వాలి. ఆ పిదప కాయలను కర్రతో అడ్డంగా పలగులకొట్టి గింజలను వేరుచేయాలి. వేరుచేసిన గింజలను పులియబెట్టి ఆ తరువాత ఎండబెట్టాలి. గలగల లాడే గింజలను గోనె సంచులలో నింపి తేమ సోకని ప్రాంతంలో నిలువ చేయాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఖరీఫ్ కూరగాయల సాగుకు సూచనలు

డా॥ యం. రవీంద్రబాబు, సీనియర్ శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధనా స్థానం, వెంకటరామన్నగూడెం
డా॥ జె. ఓం ప్రసాద్, టెక్నికల్ ఆఫీసర్, డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం
డా॥ ఆర్.వి.యస్.కె. రెడ్డి, పరిశోధన సంచాలకులు, డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం.



ప్రకృతి వైపరీత్యాలు అప్పుడప్పుడూ దెబ్బతీసినప్పటికీ సాధారణ పరిస్థితులలో మంచి ప్రణాళికాబద్ధంగా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి ఖరీఫ్ కాలంలో కూరగాయల పంటలను సాగు చేసినట్లయితే మంచి దిగుబడులు సాధించవచ్చు.

**ఖరీఫ్ సాగుకు అనుకూలమైన రకాలు :** సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాలలో ఖరీఫ్ ప్రారంభం నుండి వంగ, బెండ, తీగజాతి కూరగాయలయినటువంటి సొర, బీర, కాకర, పొట్ల, దోస పంటలను సాగు చేసుకోవచ్చు. ఆకుకూరల్లో తోటకూర, గోంగూర, పాలకూర, బచ్చలి, చుక్కకూర, మెంతికూర సాగు చేసుకోవచ్చు. వేడి తక్కువగా ఉండి సాధారణం కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాలలో టమాట, మిర్చి, పొద చిక్కుడు, దుంప జాతి కూరగాయలను సాగు చేసుకోవచ్చు. ఈ ప్రాంతాలలో కొత్తిమీరతో సహా అన్ని రకాల ఆకుకూరలు పెంచుకోవచ్చు. ఖరీఫ్ చివరిలో నాటుకుని సాగు చేసుకోవడానికి ముల్లంగి, బీట్రూట్, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ పంటలు అనుకూలం.

**నేలలు మరియు నీటి నాణ్యత :** బాగా సారవంతమైన నల్లరేగడి లేదా ఎర్రనేలలు అనుకూలం. నేల యొక్క ఉదజని సూచిక 6.5-7.5 ఉన్నట్లయితే మంచిది సాగు నీటి యొక్క ఉదజని సూచిక 6.5-6.7 మధ్య లవణ సాంద్రత 0.50 డెసీసైమన్/మీ. కన్నా తక్కువ ఉంటే బాగా అనుకూలం.

**రకాల ఎంపిక : వంగ :** వంగలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకం కాయలను ఇష్టపడతారు. శ్యామల, భాగ్యమతి, గులాబి, అర్క షీల్, అర్క ఆనంద్ వంటి సూటి రకాలు, ఉత్కర్ష, కల్పతరు, పరుల్, యు.ఎస్-172 వంటి హైబ్రిడ్ రకాలు బాగా ప్రాచుర్యం పొందినవి.

**బెండ :** అర్క అనామిక, అర్క నిఖిత, పూసాసవాని, హైబ్రిడ్ రకాలు : వర్ష, రాధిక, ఎమ్.హెచ్-10, 55, సామ్రాట్.

**టమాట :** అర్క వికాస్, పి.కె.ఎమ్-1, మారుతం, అర్కఅభ, హైబ్రిడ్ రకాలు : అర్కసామ్రాట్, అర్కఅభేద్, యు.ఎస్-440, ప్రభవ్, అభిలాష్ ఇవే కాక వైరస్ తెగుళ్ళను తట్టుకొనే రకాలు అందుబాటులో ఉన్నవి.

**పచ్చిమిర్చి :** LCA-334, LCA-620, LCA-625. ఇవి కాక వివిధ ప్రైవేట్ రకాలు కూడా అందుబాటులో ఉన్నవి.

**గోరుచిక్కుడు :** పూసా నవబహార్, పూసా సదాబహార్, గౌరి.

**బీర :** అర్క సుజాత, అర్క సుమీట్, అర్క ప్రసన్, హైబ్రిడ్ రకాలు : నాగ, ఆర్తి, చిత్ర, మల్లిక, ఎన్.ఎస్403.

**కాకర :** పూసా దోమౌసమి, కోయంబత్తూర్ గ్రీన్‌లాంగ్. హైబ్రిడ్ రకాలు : అభిషేక్, ఎన్.ఎస్-432, పాలి, ప్రాచి, శ్వేత.

**కీరదోస :** ఆర్.ఎన్.ఎస్.ఎమ్-1 (పసుపు చారకాయ), ఆర్.ఎన్.ఎస్.ఎమ్-3 (పసుపు).

**సొర :** అర్క బహార్. పి.ఎస్.పి.ఎల్., పూసానవీన్. హైబ్రిడ్ రకాలు : వరద్, కావేరి, స్వాతి, రంజా, ప్రతీక్.

**గుమ్మడి :** అర్క, చందన్, అర్క సూర్యముఖి.

**పొట్ల :** శ్వేత పిజకె.ఎమ్-1 (చారలకాయ)

**బూడిదగుమ్మడి :** శక్తి.

**తోటకూర :** ఆర్.ఎన్.ఎ.-1, అర్క సుగుణ, అర్క అరుణిమ (ఎరుపు)

**పాలకూర :** ఆల్‌గ్రీన్, అర్క అనుపమ.

**కొత్తిమీర :** స్వాతి, సాధన, సింధు, సుగుణ, సురుచి, అర్క ఈష.

**విత్తన శుద్ధి :** రసంపీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 8 గ్రాములు ఒక కిలో విత్తనానికి, నారుకుళ్ళు తెగులును తగ్గించుకోవడానికి కాప్టాన్ లేదా థైరాం 3 గ్రాములు కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేసుకోవాలి. థైరాన్ లేదా కాప్టాన్ బదులుగా ట్రైకోడెర్మా 5 గ్రాములు కిలో విత్తనానికి కలిపి కూడా విత్తన శుద్ధి చేసుకోవచ్చు.



## నాణ్యమైన నారు పెంపకం

**:** ఇటీవల కాలంలో ప్లాస్టిక్ పాట్‌లలో కోకోపీట్, పెర్లైట్, వర్మికులైట్ (3:1:1) మిశ్రమంలో నారును పెంచే పద్ధతి బాగా ప్రాచుర్యం పొందింది. షెడ్‌నెట్‌ల క్రింద, లేదా గ్రీన్ హౌస్‌లలో పెంచిన నారును చీడపీడలు తక్కువగా ఆశించటం వలన



నారు బాగా ధృఢంగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. ప్రొట్రేలలో పెంచిన నారును తీసి ప్రధాన పొలంలో నాటుకొనేటపుడు వేర్లు తెగిపోవడం ఉండదు. కాబట్టి మొక్కలు త్వరగా నిలదొక్కుకుని ఆరోగ్యంగా పెరుగుతాయి. ఈ విధంగా నారు పెంచి నాటుకోవడానికి వంగ, టమాట, మిరప పంటలకు బాగా అనుకూలం.

**నేల తయారీ :** వేసవిలో లోతుగా దున్నుకోవడం ద్వారా నేల బాగా గుల్ల బరుచుకోవాలి. ఈ దుక్కుల వలన ఎండాకాలంలో ఉండే వేడికి నేలలో ఉన్న పురుగుల యొక్క కోశస్థ దశలు చనిపోతాయి. వర్షాకాలం ప్రారంభంలో గొర్రుతో నేల బాగా గుల్ల బారే వరకు దున్నుకోవాలి. నేల తయారీ సమయంలో ఎకరాకు 10-12 టన్నుల పశువుల ఎరువును పొలంలో వేసుకొని కలియదున్నాలి. బోదెలు లేదా కాలువలను వాలుకు అడ్డంగా చేసుకొన్నట్లయితే వర్షపు నీరు నేలలోకి బాగా ఇంకుతుంది.

## నాటే దూరం మరియు విత్తన మోతాదు :

| పంట | నాటే దూరం | విత్తన మోతాదు (ఎకరాకు) |
|---|---|---|
| వంగ | 75 × 50 సెం.మీ | 150-200 గ్రా॥ |
| టమాట | 60 × 50 సెం.మీ | 150-180 గ్రా॥ |
| పచ్చిమిర్చి | 60 × 50 సెం.మీ | 200-225 గ్రా॥ |
| బెండ | 60 × 50 సెం.మీ | 4-6 కిలోలు |
| గోరుచిక్కుడు | 60 × 50 సెం.మీ. | 12-16 కిలోలు |
| పొదచిక్కుడు | 60 × 50 సెం.మీ | 14-16 కిలోలు |
| బీర | 1.5-2.0 × 0.5 మీ. | 600-800 గ్రా॥ |
| కాకర | 1.5 × 0.50 మీ. | 800-1000 గ్రా॥ |
| సొర/ఆనప | 3.0 × 1.0 మీ. | 1.0-1.2 కిలోలు |
| దోస | 1.5 × 0.5 మీ. | 400-500 గ్రా॥ |

**నీటి యాజమాన్యం :** డ్రిప్ పద్ధతిలో ఇన్‌లైన్ డ్రిప్పర్ల ద్వారా నీటిని అందించటం ద్వారా నీటిని ఆదా చెయ్యటమే కాకుండా, కలుపును తగ్గించుకోవచ్చు.

**కలుపు నివారణ :** నాటిన 48 గంటలలోపు నేలలో తగినంత తేమ ఉన్నపుడు పెండిమిథాలిన్ కలుపు మందును 6 మి.లీ/ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకొని 25 రోజుల వరకు విత్తనం ద్వారా వచ్చే కలుపును నివారించుకోవచ్చు. నాటిన 25-30 రోజుల సమయంలో బోదెలు ఎగదోయటం లేదా బెడ్‌ల మధ్యలో పొరలతో చెక్కి కలుపు లేకుండా చేసుకోవాలి. మల్చింగ్ పద్ధతిలో కూరగాయ పంటలను సాగుచేసుకొని కలుపును నివారించవచ్చు.

**పోషక యాజమాన్యం :** నత్రజని, పొటాష్ ఎరువులను సమాన దఫాలుగా వారంలో రెండుసార్లు డ్రిప్ ద్వారా ఫెర్టిగేషన్ పద్ధతిలో అందించుకొని మంచి ఫలితాలు పొందవచ్చు. ఆఖరి దుక్కిలో ఎకరాకు 2 కిలోల అజోస్పైరిల్లం లేదా అజటోబాక్టర్ మరియు 2 కిలోల పి.ఎస్.బి. మరియు 2 కిలోల కె.ఎస్.బి.లను పశువుల ఎరువు, వేపపిండి (90:10 కిలోల)లో కలిపి అభివృద్ధి చేసుకొని సాళ్ళలో వేసుకొని రసాయనిక ఎరువుల వాడకాన్ని 25 శాతం వరకు తగ్గించుకోవచ్చు. పూత సమయంలోను మరియు వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో పంటపై పొటాషియం నైట్రేట్ (13-0-45) ను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున 7-10 రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు పిచికారి చేసుకొన్నట్లయితే మంచి ఫలితాలు పొందవచ్చు.

**ఆకుకూరల సాగు :** తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి ఆకుకూరలను వారం వ్యవధిలో దఫ దఫాలుగా నాటుకొన్నట్లయితే ప్రతిరోజు కొన్ని కట్టలుగా కట్టి మార్కెట్టుకు పంపుకోవచ్చు. నాటిన 25-30 రోజుల నుండి కోత చేపట్టవచ్చు. పురుగులు ఆశించకుండా వేపనూనె లేదా వేపగింజల కషాయాన్ని పిచికారి చేసుకోవాలి.

**సమగ్ర సస్యరక్షణ చర్యలు :** పొలంలో అక్కడక్కడా పక్షి స్థావరాలను లేదా పంగల కర్రలను పాతుకోవడం ద్వారా గొంగళిపురుగులను పక్షులు వచ్చి ఏరుకుని తింటాయి. లింగాకర్షక బుట్టలను, దీపపు ఎరలను ఏర్పాటు చేసుకోవాలి. పొలంలో అక్కడక్కడా ఆముదం మొక్కలను పెంచుకొని పొగాకు లద్దెపురుగు, శనగపచ్చ పురుగు తాలూకు గ్రుడ్లను ఆకుల అడుగు భాగాన గమనించిన వెంటనే ఏరి నాశనం చేసుకోవాలి.



# కౌజు పిట్టల పెంపకం - లాభదాయకం

**డా. వి. కీర్తి,** రీసెర్చ్ స్కాలర్, ఎన్.టి.ఆర్. కాలేజి ఆఫ్ వెటర్నరీ సైన్స్, గన్నవరం.
**డా. టి. సుష్మిత,** సహాయ ఆచార్యులు, ఎన్.టి.ఆర్. కాలేజి ఆఫ్ వెటర్నరీ సైన్స్, గన్నవరం.

**"పోషకాలలో మెండు - కౌజుల పెంపకం ఇప్పుడు ట్రెండు"**



కౌజు పిట్టను తెలుగులో అడవి పూరేడు పిట్ట, అడవి పూరి పిట్ట, పరిషు పిట్ట అని అంటారు. కౌజు పిట్ట గుడ్లను చైనీయులు కొన్ని వందల సంవత్సరముల నుండి వారి ఔషధములలో వినియోగిస్తున్నారు. కౌజు పిట్ట గుడ్లు, కోడి గుడ్ల కంటె మూడు రెట్లు పోషకపరమైనవి. వీటి గుడ్లలో కాల్షియం, ఫాస్ఫరస్, ప్రొటీన్లు, ఇనుము, ఎ, బి$_1$, బి$_2$ విటమిన్‌లు ఉంటాయి. కౌజు పిట్టల పెంపకం నవీనమైనది. కౌజు పిట్ట మాంసానికి విపరీతమైన ఆదరణ పెరిగింది. కోళ్ళు, బాతుల మాంసం కంటె ఇది బలవర్థకం. **శాస్త్రీయ నామం : కోటర్నిక్స్ కోటర్నిక్స్**

**జాతి ఎంపిక :** కోళ్ళలో మాదిరిగా కౌజుల్లో కూడా మాంసం కోసం, గుడ్లు కోసం పెంచే జాతులు ఉన్నాయి. గుడ్లు కోసం పెంచేవి లేయర్స్. ఈ జాతులు ఫారో, బ్రిటీష్ రెంజ్, ఇంగ్లీష్ వైట్, మంచూరియన్ గోల్డ్ కాగా మరియు మాంసం కోసం పెంచే బాయిలర్స్‌లో బాబ్ వైట్ (అమెరికన్), వైట్ బ్రెస్టెడ్ (ఇండియన్), జపనీస్ క్వయల్ ఉన్నాయి. మన వద్ద ఎక్కువగా జపనీస్ క్వయిల్ నుంచి అభివృద్ధి పరచిన రకాలను పెంచుతున్నారు.

## మనదేశంలో అభివృద్ధి చేయబడిన కౌజు జాతి రకాలు:

- కారి ఉత్తమ్, - కారి ఉజ్వల్, - కారి శ్వేత, - కారి పర్ల్, - ఎస్.వి.వి.యు. బ్లాక్, - నందనం కౌజు పిట్ట

కౌజు పిట్టల పెంపకం వల్ల కలిగే లాభాలు :

అతి తక్కువ స్థలం, తక్కువ పెట్టుబడి సరిపోతుంది. తక్కువ వయసులోనే అనగా 5 వారాల వయసులోనే ఎదుగుతాయి. కోడి పిల్ల మాంసం కంటె కూడా కౌజు పిట్ట మాసం రుచిగా ఉంటుంది. బ్రతికి ఉన్న కౌజు పిట్టలో 70-73 శాతం బరువు, కౌజు పిట్ట మాంసం కలిగి ఉంటుంది. ఆరు నుండి ఏడు వారాల వయసులోనే గుడ్లు పెట్టడం మొదలుపెడతాయి. పోషకపరంగా చూస్తే కౌజు గుడ్ల, కోడి గుడ్లుతో సమానంగా బలవర్ధకమైనవి. వీటి గుడ్లలో ప్రొటీన్లు, ఫాస్ఫరస్, ఇనుము, ఎ, బి$_1$, బి$_2$ విటమిన్‌లు ఉంటాయి. వీటికి ఉండే రోగనిరోధక శక్తి వల్ల వ్యాపార సరళిలో పెంచినప్పుడు నష్ట భయం ఉండదు.

## కౌజుల పెంపకంలో యాజమాన్య పద్ధతులు :

**1. పెంపక కేంద్రము : 1) రెల్లు గడ్డి పరిచిన స్థలం : 6 కౌజు పిట్టలను 1 చదరపు అడుగు స్థలంలో పెంచవచ్చు. రెండు వారాల** తరువాత కౌజు పిట్టలను, కౌజులలో పెట్టి పెంచవచ్చు.

**2. మేత (ఆహారం) : మేతలోని పదార్థాలు :** 1. పక్షి పిల్లకి కావలసిన మేత (Chick Mash). 2) పెరుగుతున్న పక్షి పిల్లలకు కావలసిన మేత. మేత తయారు చేయుటకు కావలసిన ముడి పదార్థములు స్వల్ప తేడాతో తయారుచేయవలసి ఉంటుంది. మొక్కజొన్నలు, జొన్నలు, నూనె తీసిన ధాన్యపు పొట్టు, వేరుశనగ చెక్క, పొద్దు తిరుగుడు చెక్క, సోయా పిండి, చేపల మేత, ఖనిజ లవణాల మిశ్రమం, గుల్లల పొట్టు. మేత చిన్న రేణువులుగా కలిపి చేయబడుతుంది.

**3. పెంపక నిర్వహణ :** సామాన్యంగా, ఒకరోజు వయసు గల కౌజు పిట్ట 8-10 గ్రాముల బరువు కలిగి ఉంటుంది. అందువలన కౌజు పక్షి పిల్లలకు ఎక్కువ ఉష్ణోగ్రత అవసరం.



"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



ఆరు వారాల వయసులో ఆడ కౌజు పిట్టలు సామాన్యంగా 175-200 గ్రాముల బరువు, మగ కౌజు పిట్టలు 125 - 150 గ్రాముల బరువు కలిగి ఉంటాయి. ఆడ కౌజు పిట్టలు, 7 వారాల నుండి గుడ్లను పెట్టడం మొదలు పెట్టి, 22 వారాల వయసు వరకూ పెడుతూనే ఉంటాయి. సాధారణంగా రోజులోని సాయంత్రం సమయంలో కౌజు పిట్టలు గుడ్లు పెడతాయి. కౌజు పిట్టల గుడ్లు సామాన్యంగా సుమారు 9-10 గ్రాముల బరువు కలిగి ఉంటాయి. మామూలుగా, మగ కౌజు పిట్ట ఛాతీ చిన్నగా ఉండి, గోధుమ రంగు తెల్లటి ఈకతో సరిసమానంగా కప్పబడి ఉంటుంది. ఆడ, మగ కౌజు పిట్టలు, నాలుగు వారాల వయసులో వేరు చేయబడాలి. గుడ్లు పెట్టే కౌజు పిట్టలకి రోజుకు 16 గంటల వెలుతురు అవసరం.

**4) పునరుత్పత్తి :** ఏడు వారాల వయసులో, కౌజు పిట్టలు గుడ్లు పెట్టడం మొదలు పెడతాయి. 8వ వారం వయసులోనే 50 శాతం గుడ్లు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుంటాయి. శ్రేష్ఠమైన గుడ్ల ఉత్పత్తి కోసం, 8-10 వారాల వయసు గల మగ కౌజు పిట్టలు, ఆడ కౌజు పిట్టలతో పాటు పెంచబడాలి. మగ, ఆడ కౌజు పిట్టల నిష్పత్తి 1 : 5. కౌజు పిట్టలతో గుడ్లు పొదగబడే సమయం 18 రోజులు.

**5) కౌజు పిట్టల వ్యాధులు, నివారణ :** సంతానోత్పత్తి దశలో ఉన్న కౌజు పిట్టలలో ఖనిజ లవణాలు విటమిన్లు లోపం ఉంటే, వాటి గుడ్ల నుండి పొదగబడిన పిల్లలు సాధారణంగా సన్నగా, బలహీనమైన కాళ్ళతో ఉంటాయి. ఇది జరగకుండా ఉండటానికి, గుడ్లు పెట్టబోయే ఆడ కౌజు పిట్టలకు సరిపడినంత ఖనిజ లవణాలు విటమిన్లను వాటి మేతతో కలిపి ఇవ్వాలి. కోడి పిల్లల కంటే సాధారణంగా కౌజు పిట్టలకు రోగనిరోధక శక్తి ఎక్కువగా కలిగి ఉంటాయి. అందువలన రోగనిరోధక టీకాలు కౌజు పిట్టలకు వేయవలసిన అవసరం లేదు.

**6) కౌజుల మార్కెటింగ్ :** 5 వారాలకు ఎదిగిన కౌజు పుంజు బరువు 150-200 గ్రా. ఉంటుంది. కౌజుల మార్కెటింగ్‌కు ఈ బరువు అనువైనది.

**కౌజు గుడ్డు :** సాధారణంగా కౌజు గుడ్డు బరువు 9-10 గ్రా. ఆడ కౌజు పిట్టలు 7 వారాల నుండి గుడ్లను పెట్టడం మొదలు పెట్టి, 22 వారాల వయస్సు వరకూ పెడుతూనే ఉంటాయి. కౌజు పిట్టలకు, 12 గుడ్లను పెట్టడానికి సుమారు 400 గ్రాముల మేత అవసరం.

**గుడ్లలో పోషక విలువలు**

**కౌజు మాంసంలో పోషక విలువలు (100 గ్రా.)**

| | |
|---|---|
| క్రొవ్వు పదార్థాలు | 16% |
| కొవ్వు పదార్థాలు | 4.5 గ్రా. |
| మాంసకృత్తులు | 26% |
| మాంసకృత్తులు | 22 గ్రా. |
| ఖనిజ లవణాలు | |
| కొలెస్ట్రరాల్ | 70 గ్రా. |
| విటమిన్ బి-6 | 10% |
| ఇనుము | 4.51 మి.గ్రా. |
| కాల్షియం | 6% |
| కాల్షియం | 13.00 మి.గ్రా. |
| విటమిన్ 'ఎ' | 10% |
| విటమిన్ 'డి' | 13% |

**కౌజు పిట్టల పెంపకంలో ఎదురయ్యే సవాళ్ళు :**

- మగ కౌజు పిట్టలు సామాన్యంగా విచిత్రమైన శబ్దాలు చేస్తాయి. మగ, ఆడ కౌజు పిట్టలను కలిపి పెంచినప్పుడు మగ పక్షులు ఆడ పక్షులను ముక్కుతో పొడిచి గుడ్డి వాటిని చేస్తాయి.

**కౌజుల పెంపకం ద్వారా ఆదాయం విలువలు :**

- 5-6 వారాల వయసు కలిగిన కౌజులు 190-200 గ్రాములు ఉంటాయి. ఒక్క కౌజు పిట్ట మాంసం ధర ప్రస్తుత మార్కెట్ అధ్యయనం ప్రకారం రూ. 40/- - 50/- ధర పలుకుతుంది.



"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# మంచినీటి (స్కాంపి) రొయ్యల పెంపకం



శ్రీ పి. కోటేశ్వరరావు, అదనపు సంచాలకులు, మత్స్యశాఖ, SIFT, కాకినాడ



మన రాష్ట్రంలో మంచి నీటి వనరులు పుష్కలంగా ఉండి వివిధ రకములైన చేపలు, బ్రాకిష్ వాటర్ రొయ్యలు మరియు మంచినీటి రొయ్యల పెంపకమునకు అనుకూలంగా ఉంటూ, రాష్ట్రానికి మంచి ఆదాయం ను ఆర్జిస్తూ అగ్రస్థానంలో నిలుపుతున్నాయి. మంచినీటి రొయ్యల కు వాణిజ్యపరంగా విదేశీ మార్కెట్లో మంచి గిరాకీ ఉండుటవలన ప్రస్తుతం మంచినీటి రొయ్యల సాగు వేగంగా విస్తరిస్తోంది.

మన రాష్ట్రంలో కోస్తా తీరప్రాంతాలలోనే కాకుండా రిజర్వాయర్లు, చెరువులు వంటి మంచి నీటి వనరులు అధికంగా గల రాయలసీమ ప్రాంతంలో కూడా పెంపకమునకు ఇది చాలా అనుకూలమైన రకము అవ్వడం వలన ఆక్వారైతులు స్కాంపి (మెక్రోబ్రకీయమ్ రోసెంబర్గీ) రొయ్యల పెంపకంనకు మొగ్గు చూపుతున్నారు.

స్కాంపి రొయ్యల పెంపకం రెండు దశలలో చేపట్టవలెను

- నర్సరీదశ
- పెంపకదశ

## నర్సరీదశ:

ఈ దశలో హేచరీల నుండి సేకరించిన PL దశ రొయ్య పిల్లలను రెండు నుంచి ఐదు గ్రాముల వరకు నర్సరీ చెరువుల్లో పెంచుకోవలెను. నర్సరీ చెరువు 0.02-0.1 హెక్టార్ల విస్తీర్ణం వరకు ఉండవచ్చు. ప్రతిచదరపు మీటరుకు 20 నుండి 50 వరకు పిల్లలు స్టాకు చేసుకోవచ్చు. వీటికి మార్కెట్లో దొరికే మేతలను ఆహారం ఇవ్వాలి. మొదటి రెండు వారాలు శరీరబరువుకు సమానంగా 100% మేతను, ఆ తర్వాత 3-4 వారాలు శరీర బరువులో 20 శాతం మేతను ఇస్తే సరిపోతుంది. ఆరు వారాల తరువాత 2-5 గ్రాములవరకుఎదుగును.

## పెంపక చెరువు దశ:

మంచినీటి రొయ్యల పెంపకంలో మంచి దిగుబడులు సాధనకు స్థల ఎంపిక చాలా ముఖ్యమైనది. ఒంగ్రు నెలలు అనుకూలంగా వుండును. నీటి ఉష్ణోగ్రత 200 C కంటే పైబడి 6-8 నెలలు ఉంటే రొయ్యలు పెరుగుదలకు అనువుగా ఉండును. చెరువు దీర్ఘచతురస్రాకారంలో ఉంటూ 0.5 నుండి 1.00 హెక్టార్ల విస్తీర్ణం వరకు ఉండవచ్చు. అడుగు భాగం ఒక ప్రక్కకు ఏటవాలుగా ఉండేటట్లు చూసుకొని నీటి లోతు 1.2 మీటర్లు నుండి 1.5 మీటర్లు వరకు ఉండేటట్లుగా చెరువుగట్లను ఏర్పాటు చేసుకోవాలి.

చెరువు నిర్మాణం పూర్తి అయిన పిదప అడుగు భాగం బాగ దున్ని, pH ఆధారంగా 200 కేజీల వరకు సున్నం చల్లి శుభ్రముగా నీటిని వడపోసి ఒకమీటరు లోతువరకు నీటిని నింపుకోవాలి. ఆ పిదప ప్లవకాలు అభివృద్ధి చెందుటకు రెండుమూడు విడతలుగా పేడ, యూరియా మరియు సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ కలుపవలెను.

ముఖ్యంగా ఒక్క రొయ్యల పెంపకం మాత్రమే అయితే ఎకరం నీటి విస్తీర్ణంలో 40000 వరకు జువెనైల్ రొయ్య పిల్లలను



"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



పోలీకల్చర్ సాగుచేస్తే ఎకరంకు సుమారు 10000 వరకు రొయ్య పిల్లలను మరియు 2500 నుండి 3000 వరకు బొచ్చెచేప మరియు రాగండి చేప పిల్లలను స్టాక్ చేసుకోవచ్చు. చెరువు మొత్తం విస్తీర్ణంలో 10 శాతం భాగంలో రొయ్యలకు ఆవాసాలు ఏర్పాటు చేయాలి. 20 శాతం ప్రోటీన్లు కలిగిన మేతలను రోజుకు రెండుసార్లు వేస్తూ ఉండాలి. అలాగే ప్రతి 15 రోజులకు ఒకసారి వల వేసి శాంప్లింగ్ చేస్తూ రొయ్యల ఆరోగ్యంను తనిఖీ చేస్తూ ఉండాలి. ప్రతి నెల 30 నుంచి 50 కేజీలు వరుకు సున్నం కలుపుతూ, ఆక్సిజన్ స్థాయి 5 ppm పైబడి ఉండేటట్లు చూసుకోవాలి. రొయ్యలు అన్ని ఒకేరకంగా పెరగక పోవటం వలన 5 నుండి 6 సార్లు పెట్టుబడి చేయవలసి వుండును. మొదటి పట్టుబడి 80 నుంచి 100 రోజుల తర్వాత చేయవలసి ఉంటుంది, ఆ తర్వాత నాలుగైదుసార్లు ప్రతి ఇరవై నుంచి ముప్పై రోజులకు ఒకసారి చేయవలసి ఉండును.

నీటి నిర్వహణ, మేత నిర్వహణ మరియు వ్యాధులు నిర్వహణ యజమాన్యాలు సరిగా పాటిస్తే ఏకరాకు 350 నుంచి 375 కేజీల రొయ్యలును,1800 నుంచి 2000 కేజీల చేపల దిగుబడులను సాధించవచ్చును.

### రొయ్యల పెంపకంలో ఆదాయ వ్యయములు వివరములు (ఒక ఎకరా నీటి విస్తీర్ణం)

| వ.సం. | ఉపకరణములు | అయ్యే ఖర్చు రూ. |
|---|---|---|
| 1 | చెరువు లీజు | 30,000 |
| 2 | చెరువు తయారీ | 10,000 |
| 3 | స్కాంపి సీడ్ | 15,000 |
| 4 | చేప పిల్లలు (సం. లోపు పిల్లలు) | 20,000 |
| 5 | మేత ఖర్చు | 50,000 |
| 6 | చెరువులోకి నీటిని తోడేందుకు అయ్యే ఖర్చు | 10,000 |
| 7 | సహాయక సిబ్బంది మరియు రసాయనిక మందులు | 40,000 |
| 8 | పట్టుబడి ఖర్చు | 10,000 |
| 9 | మొత్తం | 1,75,000 |

### రాబడుల అంచనా

ఒక ఎకరాకు వచ్చే దిగుబడి వివరములు

రొయ్యల దిగుబడి = చెరువులో వేసిన రొయ్య సాంద్రత X బ్రతుకుదల శాతము X రొయ్య బరువు

(10,000 X 70 X 50 గ్రాములు = 350 కేజీలు)

మార్కెట్ ధరకు కేజీకి 300 రూపాయలు చొప్పున అమ్మితే = 350 X Rs. 300 = Rs 1,05,000 ..

చేపల దిగుబడి = చెరువులో వేసిన చేపల సాంద్రత X బ్రతుకుదల శాతము X చేప బరువు

(3000 X 80 X 0.800 కేజీ X 1920 కేజీలు )

మార్కెట్ ధరకు కేజీకి 100 రూపాయలు చొప్పున అమ్మితే = 1920 X Rs. 100 = Rs.192,000 .

నికరలాభము = మార్కెట్ అమ్మకము – నికరపెట్టుబడి

(Rs. 2,97,000 – Rs 1,75,000) = 1,22,000 లక్షలు / ఒక ఎకరంనకు.

కావున ఆసక్తి గల రైతులు మంచి నీటి రొయ్యల పెంపకము చేపట్టవచ్చు.



"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

## టూకీగా...

## చౌకగా డీ.ఏ.పీ.




కేంద్రం రైతులకు తీపి కబురు అందించింది. డీఏపీపై సబ్సిడీని ఏకంగా 140 శాతం పెంచింది. ఫలితంగా రైతులకు పాతధరకే.... రూ.1200 లకు బస్తా (50 కేజీలు) చొప్పున డీఏపీ దొరకనుంది. రైతుల జీవితాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అంతర్జాతీయంగా ధరలు పెరిగినా.. డీఏపీ ఎరువును పాతధరకే అందుబాటులోఉంచాలని నిర్ణయించాం' అని ప్రధానమంత్రి మోదీ ట్వీట్ చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎరువుల కంపెనీలకు డీఏపీపై బస్తాకు రూ. 500 సబ్సిడీ చెల్లిస్తోంది. దాన్ని 140 శాతం పెంచి రూ.1,200 లు చేయాలని ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. గతేడాది డీఏపీ బస్తా రూ.1,700 కు ఉండగా... అందులో రూ. 500 కేంద్రం రాయితీ ఇవ్వడంతో రైతులకు రూ.1,200 కే కంపెనీలు అమ్మాయి. అంతర్జాతీయంగా ఇటీవల ఫాస్ఫరిక్ ఆమ్లం, అమ్మోనియా ధరలు 60 నుంచి 70 శాతం పెరగడంతో డీఏపీ బస్తా ధర రూ.2,400 కు చేరింది. కేంద్రం ఇచ్చే రూ.500 రాయితీ పోను రూ. 1,900 లకు రైతులకు అమ్మాల్సిన పరిస్థితి. దీనిప్రకారం బస్తాపై రూ.700 పెంచుతున్నట్లు ఇస్కో ఏప్రిల్లో ప్రకటించినా... తర్వాత కేంద్ర ప్రభుత్వం జోక్యంతో వెనక్కి తగ్గింది. అయినా కొన్ని కంపెనీలు ధరలు పెంచేశాయి. ఈ నేపథ్యంలో డీఏపీపై రాయితీని బస్తాకు రూ. 500 నుంచి రూ.1,200 కు పెంచాలని నిర్ణయించారు. అంటే బస్తా ఖరీదు రూ.2,400 రూపాయల్లో 1,200 సబ్సిడీని కేంద్రప్రభుత్వం భరిస్తుందన్న మాట. దాంతో రైతుకు 50 కేజీల డీఏపీ బస్తారూ.1,200 లకే లభించనుంది.



## 25 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

పండించిన చోటే పంటను ప్రాసెస్ చేసి మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు పార్లమెంటు నియోజకవర్గానికి ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి శ్రీ కురసాల కన్నబాబు గారు అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రస్తుత బడ్జెట్లో రూ.186 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. స్థానికంగా లభించే పంట ఉత్పత్తుల ఆధారంగా వీటిని ఏర్పాటుచేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, ఫుడ్ ప్రాసెసింగ్ ఉన్నతాధికారులతో ఆయన ఏపీఐఐసీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో అన్నదాతలకు అదనపు ఆదాయం లభించడమేకాక లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మార్కెట్‌కు అనుగుణంగా వ్యవసాయ సలహా మండళ్ల సూచనలతో త్వరలో క్రాప్ ప్లానింగ్ అమలు చేస్తామన్నారు. ప్రత్యామ్నాయ, లాభసాటి పంటలపై దృష్టిపెట్టేలా రైతులను ప్రోత్సహించాలని కోరారు. రైతుల అవసరాల మేరకు పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులోఉంచాలన్నారు. రాష్ట్రంలో మరో లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

## వహ్వా.. చీనీ



చీనీ (బత్తాయి) రైతుల పంట పండింది. కనీవినీ ఎరుగని రీతిలో టన్ను చీనీకాయల ధర రూ.1.10 లక్షలు పలుకుతోంది. సీజన్ ప్రారంభం నుంచీ ఎప్పటికప్పుడు రికార్డు స్థాయిలో ధరలు పెరుగుతుండటంతో రైతుల మోములో ధరహాసం' తొణికిసలాడుతోంది. అనంతపురం మార్కెట్ యార్డులో టన్ను గరిష్ట ధర రూ.75 వేలు ఉండగా.. తోటల్లో నేరుగా జరుగుతున్న అమ్మకాల ధర రూ.1.10 లక్షలు పలుకుతోంది. గత వారం మార్కెట్ యార్డులో టన్ను రూ.65 వేలు పలకగా.. తోటల్లో రూ.85 వేలవరకు పలికింది. ధరలు గరిష్టంగా కొనసాగుతుండంతో ఈసారి అనంతపురం జిల్లాలో చీనీ కాయలు టర్నోవర్ 2,200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా 45 వేల హెక్టార్లలో చీనీ తోటలు ఉండగా అందులో 30 వేలహెక్టార్లలో తోటలు కాపునకు వచ్చాయి. ఈ సీజన్లో 7 లక్షల టన్నుల. దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. సీజన్ ప్రారంభమైన జనవరి, ఫిబ్రవరిలో టన్ను ధర రూ.40 వేలు ఉండగా.. క్రమంగా పెరుగుతూ వచ్చాయి. దేశవ్యాప్తంగా మార్కెట్ ఆశావహంగా ఉండటంతో వ్యాపారులు, దళారులు తోటల వద్ద మకాంవేసి కొనుగోళ్లు చేస్తున్నారు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"





# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు

1. కె. ప్రదీప్, గ్రామం :- కుమరం, మండలం:- గరివిడి, జిల్లా:- విజయనగరం, ఫోన్ నెంబర్ :- 8106656957

ప్ర. మొక్కజొన్న పంటలో ఆకులు మాడిపోతున్నాయి నివారణ తెలుపండి?

జ. మొక్కజొన్న పంటలో ఆకుమాడు తెగులు ఆశించినది. నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయండి. వారం తర్వాత హెక్సాకొనజోల్ 2 మి.లీ/ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

2. కె.వెంకటేశ్వర నాయుడు, గ్రామం :- పెనుమర్రి, మండలం:- పెనుమర్రి, జిల్లా:- చిత్తూరు, ఫోన్ నెంబర్ 99663042286

ప్ర రాగి పంట లో కాండం తొలుచు పురుగు ఉంది నివారణ తెలుపండి?

జ. రాగి పంట లో గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఆశించినది. నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

3. వాసు బాబు, గ్రామం :- పి.కె.వలస, మండలం:- చీపురుపల్లి, జిల్లా:- విజయనగరం, ఫోన్ నెంబర్ :- 9441341054

ప్ర. మినుము పంటలో ఆకులను పురుగు తినివేస్తుంది నివారణ తెలుపండి ?

జ. మినుము పంట లో చిత్త పురుగు ఆశించినవి. నివారణకుక్లోరిపైరిఫాస్ 2 మి.లీ/లీటరు లేదా మోనో క్రోటోఫాస్ 1.6 మి.లీ/లీటరు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు ఏదో ఒక మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

4. జనార్థన్, గ్రామం :- మైనాపురం, మండలం:-గుంతకల్లు, జిల్లా:- అనంతపురం, ఫోన్ నెంబర్ :- 8464977324

ప్ర. పెసర పంటలో పురుగు ఉంది నివారణ తెలుపండి?

జ. పెసర పంటలో స్టింగ్ బగ్ మరియు పూతలో పురుగు ఉంది. నివారణకు క్లోరాం ప్రెనిలిప్రోల్ 0.3 మి.లీ/ లీటరు, ప్రొపికొనజోల్ 1 మి.లీ/లీటరు (ఎకరానికి 60 మి.లీ 200 మి.లీ) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

5. ఎమ్.నాగరాజు, గ్రామం :- వెలిగండ్ల, మండలం:- కొండాపురం, జిల్లా:- నెల్లూరు, ఫోన్ నెంబర్ :- 9441306044

ప్ర. నువ్వుల పంటలో పూత రాలిపోతుంది నివారణ తెలుపండి?

జ. నువ్వుల పంటలో రసం పీల్చు పురుగులు ఆశించినవి. మరియు పూత రాలకుండా ఉండటానికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. దీనితో పాటు మల్టీ-కె ఎకరాకు 2 కిలోలు 120 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పూత రాలడం తగ్గుతుంది.

6. పిచ్చెయ్య, గ్రామం :- నల్లతిమ్మాయపల్లి, మండలం:- నందలూరు, జిల్లా:- కర్నూలు, ఫోన్ నెంబర్ :- 9346004133

ప్ర. జొన్న పంట లో ఆకులు మొవ్వలు కత్తరించినట్లు ఉన్నవి నివారణ తెలుపండి ?

జ. జొన్న పంట లో కత్తెరపురుగు ఆశించినది. నివారణకు కార్బోఫ్యురాన్ గుళికలు 3 కిలోలు మొక్కల మొవ్వలలో వేయాలి. తరువాత ప్రొపికొనజోల్ 400 మి.లీ ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

7. భాస్కర నాయుడు, గ్రామం :- కస్తూరి కండ్రిగ, మండలం:- తిరుపతి రూరల్, జిల్లా:- చిత్తూరు, ఫోన్ నెంబర్ :- 9701590966

ప్ర. చెరుకు పంట లో కలుపు ఉంది. నివారణ తెలుపండి?

జ. చెరుకు పంటలో కలుపు నివారణకు మెట్రిబ్యూజిన్ 500 గ్రాములు ం 2-4 D సోడియం సాల్ట్ 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

8. నరేష్ , గ్రామం :- ఓగిలేరు, మండలం:- పెద్ద పరిగిని, జిల్లా:- చిత్తూరు, ఫోన్ నెంబర్ :- 9000930669

ప్ర. అలసంద పంటలో ఆకులపై పురుగులు ఉన్నాయి నివారణ తెలుపండి?

జ. అలసంద పంటలో పొగాకు లద్దె పురుగు ఆశించినది. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ/లీటరు లేదా నోవాల్యురాన్ 1 మి.లీ/లీటరు లేక ధయోడికార్బ్ 1.5

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

గ్రాములు/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

## ఉద్యాన పంటలు

9. ఎస్.మాధవి, గ్రామం :- చెంబూరు, మండలం:- రామసముద్రం, జిల్లా:- చిత్తూరు, ఫోన్ నెంబర్ :- 9154466842

**ప్ర. టమాటా పంట లో కాయలపై పగుళ్ళు ఏర్పడుతున్నాయి నివారణ తెలుపండి?**

జ. టమాటా పంట లో బోరాన్ లోపం వలన కాయలపై పగుళ్ళు ఏర్పడుతాయి. నివారణకు బోరాక్స్ 3 గ్రాములు/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

10. మహేష్, గ్రామం :- అచ్యుతాపురం, మండలం:- హరపాలెం, జిల్లా:- విశాఖపట్నం, ఫోన్ నెంబర్ :- 7336704258

**ప్ర. పెరటి లో బెండ మరియు బీర మొక్కలపై పురుగు ఉంది నివారణ తెలుపండి?**

జ. బీర మరియు బెండ పంటలలో పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పెరటి లో వేసారు కనుక 4 గ్రాములు (10 లీటర్ల నీటికి) సరిపోతుంది.

11. కె.శివరామిరెడ్డి, గ్రామం :- గుండ్లపల్లి, మండలం:- ఐరాల, జిల్లా:- చిత్తూరు, ఫోన్ నెంబర్ :- 9390242190

**ప్ర. వంగ పంట లో లేత ఆకులు తెల్లగా మారుతున్నాయి నివారణ తెలుపండి?**

జ. వంగ పంట లో ఇనుపధాతువు లోపం ఉంది. నివారణకు అన్నభేది 5 గ్రాములు + 0.5 గ్రాముల నిమ్మఉప్పు + 10 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. వారం రోజుల తర్వాత మరలా అదేవిధంగా పిచికారీ చేయాలి.

12. బాబ్జి, గ్రామం :- ఎర్రవరం, మండలం:- ఏలేశ్వరం, జిల్లా:- తూర్పు గోదావరి, ఫోన్ నెంబర్ :- 9490243852

**ప్ర. మునగ పంట లో సరైనఎదుగుదల కనిపించట్లేదు. మరియు ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయి. నివారణ తెలుపండి?**

జ. మునగ పంట లో పోషకాల లోపం ఉంది. నివారణకు ఒక్కో మొక్కకు 250 గ్రాముల యూరియా మరియు 300 గ్రాముల భాస్వరం, 150 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ను మొదలు దగ్గర వేసుకోవాలి. పై పాటుగా మల్టి-కె(13.0.45) ఎకరాకు 2 కిలోలు పిచికారీ చెయ్యాలి. కలుపును ఎప్పటికప్పుడు తీసివేయాలి.

13. దేవుడు బాబు, గ్రామం :- పరిమిడి, మండలం:- తానం, జిల్లా:- విశాఖపట్నం, ఫోన్ నెంబర్ :- 7830549185

**ప్ర. తోటకూర ఆకులపై తెల్లని మచ్చలు ఉన్నాయి నివారణ తెలుపండి?**

జ. తోటకూర మొక్కలలో రసం పీల్చు పురుగులు ఆశించినవి. నివారణకు వేపనూనె (1500 పిపిఎం) 5 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

14. నల్లన. లక్ష్మీనారాయణ, గ్రామం :- సరియాపల్లి, మండలం:- కంచిలి, జిల్లా:-శ్రీకాకుళం, ఫోన్ నెంబర్ :- 9550313008

**ప్ర. దొండ పంట లో కాయలు వంకర్లు తిరుగుతున్నాయి నివారణ తెలుపండి?**

జ. దొండ పంట లో నల్లి ఆశించినది. నివారణకు ప్రొపెర్గైట్ 2మి.లీ/లీటరు నీటికి మరియు ఒమైట్ 2మి.లీ/లీటరు నీటికి కలిపి వారానికి ఒక సారి నల్లి ఉధృతి తగ్గేవరకు పిచికారీ చేసుకోవాలి.

15. వెంకటరమణ, గ్రామం :- వగంతపర్తి, మండలం:- పొదలకూరు, జిల్లా:-నెల్లూరు, ఫోన్ నెంబర్ :- 6301168598

**ప్ర. నిమ్మ తోట లో పిందెలు పండుబారి పోయి రాలిపోతున్నాయి నివారణ తెలుపండి?**

జ :- నిమ్మతోట లో పోషక లోపం వలన పిందెలు పండుబారి రాలిపోతున్నాయి. నివారణకు ఒక చెట్టుకు పశువుల ఎరువు 100 కిలోలు + వేప పిండి 5 కిలోలు + ఆముదం పిండి 2 కిలోలు + కానుగ పిండి 3 కిలోలు + యూరియా 1.6 కిలోలు + సింగల్ సూపర్ ఫాస్ఫేట్ 4 కిలోలు + మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 1.5 కిలోలు వేసుకోవాలి. ఈ ఎరువులు సంవత్సరంలో 2 సార్లుగా వేసుకోవాలి.

16. జి.సురేష్ కుమార్ రెడ్డి , గ్రామం :- చింతలవారిపల్లి, మండలం:- సోదం, జిల్లా:- చిత్తూరు, ఫోన్ నెంబర్ :- 9959279962

**ప్ర. అరటి తోట లో కాయలపై గోధుమరంగు మచ్చలు ఉన్నాయినివారణ తెలుపండి?**

జ. అరటి తోట లో గెలలపై ఎండ ఎక్కువగా పడటం వలన కాయలపై మచ్చలు వస్తాయి. కాయలపై మచ్చల వలన ఎటువంటి సమస్య ఉండదు. ఎండిపోయిన ఆకులతో కాని లేదా కవర్ల తో కాని గెలను కప్పి ఉంచుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154

1. శ్రీధర్, చక్రాయపేట గ్రా., చక్రాయపేట మం., కడప జిల్లా. ఫోన్ : 8688824350



**ప్ర. నిమ్మ పంటలో కాయలు నల్లగా మారుతున్నాయి నివారణ తెలుపండి ?**

జ. నిమ్మ పంటలో మంగు ఆశించింది. నివారణకు లీటరు నీటికి 2.5మి.లీ డైకోఫాల్ 18.5 EC లేదా లీటరు నీటికి 2గ్రాముల నీటిలో కరిగే గంధకం చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారీ చేయాలి.



2. కృష్ణా రావు, వెంకటబైరవపురం గ్రా, మక్కువ మం., విజయనగరం జిల్లా. ఫోన్ : 7780376601

**ప్ర. వరి పంటలో దుబ్బుల దగ్గర దోమ ఉంది నివారణ తెలుపండి ?**

జ. వరి పంట లో సుడిదోమ ఆశించినది. నివారణకు ఎకరానికి పైమిత్రజోన్ (చెస్) 120 గ్రాములు పిచికారీచేసుకోవాలి.



3. వెంకటేశ్వర్లు, కృష్ణ గంధి పురం గ్రా, వరికుంటపాడు మం, నెల్లూరు జిల్లా. ఫోన్ : 9000020414

**ప్ర. బత్తాయి పంటలో కాయలు పండుబారి రాలిపోతున్నాయి నివారణ తెలుపండి ?**

జ. బత్తాయి కాయలకు పండుబారు తెగులు ఆశించింది. నివారణకు సాఫ్ (కార్బండిజమ్ + మాంకోజెబ్ ) 2.5 గ్రాములు మరియు జిగురు పదార్థం 1 మి. లీ. మందులను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కాయలపై వచ్చు పోషకాల లోపాల నివారణకు మల్టి - కె 13-0-45 పొటాషియం నైట్రేట్ ను 10 గ్రాములు + పండ్ల తోటలకు సంబంధించిన సూక్ష్మ పోషకాల ఫార్ములా మందును 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీచేసుకోవాలి.



4. శివరామిరెడ్డి, మాధవరం గ్రా, ఒంటిమిట్ట మం, కడప జిల్లా. ఫోన్ : 9346261610

**ప్ర. టమాట పంటలో ఆకులు ముడుచుకుపోతున్నాయి నివారణ తెలుపండి ?**

జ. టమాటాపంటలోఆకుమాడు తెగులు ఆశించింది. నివారణకు క్లోరథమోనిల్ 2 గ్రాములు లేదా (మాంకోజెబ్ + కార్బండిజిమ్) సాఫ్ 2.5 గ్రాములు/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

5. రమేష్ బాబు, జమ్ములపాలెం గ్రా, టంగుటూరు మం, ప్రకాశం జిల్లా. ఫోన్ : 8184863115



**ప్ర. మిరప పంటలో పురుగు ఉంది నివారణ తెలుపండి ?**

జ. మిరప పంట లో లద్దె పురుగు ఆశించినది. నివారణకుథయోడికార్బ్(లార్విన్) 1.5గ్రాములు/ 1 లీటరు నీటికి(ఎకరానికి 300 గ్రాములు/200 లీటర్ల నీటిలో కలిపి) పిచికారీ చేయాలి. వారం రోజుల తరువాతనోవాల్యురాన్ (రీమాన్)1 మి.లీ/1 లీటరు నీటికి కలిపి(ఎకరానికి 200 మి.లీ) పిచికారీ చేయాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

6. రమేష్ , కోడూరు గ్రా, కోడూరు మం, కడప జిల్లా. ఫోన్ : 8919098152



**ప్ర. కోడి సన్నగా అయిపోతుంది ఏ మందు వాడాలి చెప్పండి?**

జ. మీ కోడికి వైరస్ ఆశించింది నివారణకు 1) Inj. Procaine Pencilline - 0.8 ml i/m 2) Inj. Melonex -1ml i/m. 5 రోజులు ప్రతి రోజు కోడి కండకు చేయించవలెను. పచ్చి పసుపు + వేప ఆకు కలిపి నూరి పొక్కుల ఉన్న ప్రదేశం లో రాయవలెను.



7. హరి, కొత్తకోట గ్రా, పూతలపట్టు మం, చిత్తూరు జిల్లా. ఫోన్ : 9346276066

**ప్ర. గులాబీ చెట్టుకు ఆకులు & కొమ్మలు పైరసం పిలుచు పురుగులుపేను ఉంది నివారణ తెలుపండి ?**

జ. గులాబీతోటలో పేను ఆశించినది. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీలేదా డైమిథోయేట్ 2 మి.లీ/ లీటరు నీటికి + మల్టీ–కె 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి.

8. కృష్ణారావు, ఎనికపాడు గ్రా, సంతనూతలపాడు మం, ప్రకాశం జిల్లా. ఫోన్ : 9912649751



**ప్ర. బొప్పాయి పిందెలో & కాయలలో లద్దె పురుగులు ఉన్నాయి నివారణ తెలుపండి ?**

జ. బొప్పాయి పిందెలలో పొగాకు లద్దెపురుగు ఆశించినది. నివారణకు మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి 2మి.లీచొప్పున మరియు శాండోవిట్ (జిగురు) ఒక లీటరు నీటికి 1 మి.లీచొప్పున కలుపుకొని పిందెలు అన్ని బాగా తడిచేలా పిచికారీ చేయవలెను.



9. అంజప్ప, పెద్దకప్పాలి గ్రా, పెద్ద పంజాని మం, చిత్తూరు జిల్లా. ఫోన్ : 9381883600

**ప్ర. బీన్స్ పంటలో మొక్కలు కాండం దగ్గర బూజు పట్టి మొక్కలు చనిపోతున్నాయి నివారణ తెలుపండి ?**

జ. బీన్స్ పంటలో కాండం కుళ్ళు తెగులుఆశించినది.నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ/ లీటరు నీటికి కలిపి మొక్క కాండం తడిచేలా పిచికారీ చేసుకొనవలెను.



10. ఉమామహేశ్వరరెడ్డి, మచుపల్లి గ్రా, సిద్దవటం మం, కడప జిల్లా. ఫోన్: 630567076

**ప్ర. కాకర పంటలో ఆకులు ముడుచుకు పోతున్నాయి నివారణ తెలుపండి ?**

జ. కాకర తోటలో వైరస్ వలన వెర్రి తెగులు ఆశించింది.రసం పీల్చు పురుగు వలన వస్తుంది. దీని నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ మరియు ఎసిఫేట్ 2 గ్రాములు/లీటరు నీటికి కలిపి 15రోజులలో రెండుసార్లు మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలి.

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

**1. కొబ్బరి తోటలో తుంగ ఎక్కువగా ఉంది నివారణ తెలుపండి?**

జ. కొబ్బరి తోట లో తుంగ నివారణకు గ్లైఫోసేట్ అమ్మోనియం 5 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**2. కొబ్బరి పంట లో ఆకులపై వలయాకారంగా తెల్లని బూజు లాగా ఏర్పడుతుంది.నివారణ తెలుపండి?**

జ. కొబ్బరి తోటలో సర్పిలాకార తెల్లదోమ ఆశించినది. సామూహికంగా తెల్ల దోమ నివారణ తీసుకోవడం వల్ల దీని వ్యాప్తిని అరికట్టవచ్చు. తెల్ల దోమ నివారణకు వేపనూనె (1500 పిపియం) 3 మి.లీ/లీటరు నీటికి కలపి మట్ట పూర్తిగా తడిసేలా 7 రోజుల వ్యవధిలో రెండు సార్లు పోర్సుగా పిచికారీ చేసుకోవాలి. చెట్టు చుట్టూ కందకం చేసుకుని 1 కిలో వేపపిండి మరియు పశువుల ఎరువు 2 కిలోలు వేసుకున్న తరువాత మట్టి వేసుకుని నీరు పెట్టుకోవాలి.

**3. దానిమ్మ తోట లో కాయలపై నల్లని మచ్చలు వచ్చి కుల్లిపోతున్నాయి నివారణ తెలుపండి?**

జ. దానిమ్మ తోట లో కాయలకు పక్షి కన్ను తెగులు ఆశించినది.నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయవలెను.

**4. పుచ్చ పంట లో కాయలపై మరియు పిందెలపై మచ్చలు వచ్చి రాలిపోతున్నాయి నివారణ తెలుపండి?**

జ. పుచ్చ కాయలు కోయటానికి 10 రోజుల ముందు కార్బండిజమ్ (బావిస్టిన్) 1.5 గ్రాములు/1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయండి.

**5. బొప్పాయి తోటలో పిండి నల్లి ఉంది నివారణ తెలుపండి?**

జ. బొప్పాయి తోట లో పిండినల్లి ఆశించినది. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు ంప్రొపెనోఫాస్ 2 మి.లీ/ లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి.

**6. టమాటా పంటలో ఆకులుపై మచ్చలు వచ్చి ఎండిపోతున్నాయి. నివారణ తెలుపండి ?**

జ. టమాటో బ్లైట్ ఆశించినది. టేబ్యుకొనజోల్ ం ట్రై ఫ్లాక్సిస్ట్రోబిన్ (నాటివో) 0.75 గ్రాములు/లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.5 రోజుల తర్వాత ప్రొపికొనజోల్ 1మి.లీ/లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

**7. వంగ పంట లో మొవ్వ మరియు కాయలలో పురుగు ఉంది నివారణ తెలుపండి?**

జ. వంగ పంట లో కాయంతొలుచు పురుగు ఆశించినది.నివారణకు కాయలు కోసిన తర్వాత థయోడికార్బ్ 1.5గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ/లీటరు నీటికి కలిపి ఎదో ఒక దానిని పిచికారీ చేసుకోవాలి.

**8. మినుము పంటలో ఆకులపై బొబ్బలు లాగా వచ్చాయి మరియు ఆకులు ముడుచుకు పోతున్నాయి నివారణ తెలుపండి?**

జ. మినుము పంటలో సీతాఫలం తెగులు మరియు దోమ ఆశించినది.నివారణకు ఎకరానికి ఎసిటామిప్రిడ్ 40 గ్రాములు మరియు వేప నూనె 1500 ppm 1లీటరు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**9. రాగి పంటలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఉన్నాయి నివారణ తెలుపండి?**

జ. రాగి పంటలో ఆకుమచ్చ తెగులు ఆశించినది. నివారణకు ఎకరానికి కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ (సాఫ్) 400 గ్రాములు పిచికారీ చేసుకోవాలి.

**10. మల్లె మొగ్గలు సన్నగా ఉన్నాయి బాగా రావడానికి సలహా తెలుపండి ?**

జ. మల్లె మొగ్గలు సన్నగా ఉన్నాయి దాని కోసం ఒక్కొక మొక్కకు యూరియా 100 గ్రాములు,సింగల్ సూపర్ ఫాస్ఫేట్ 500 గ్రాములు,పొటాష్ 100 గ్రాములు పశువుల ఎరువు వేసుకోవాలి.

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**






# రైతుల స్పందన

నా వేరుశనగ పొలంలో పేనుబంక మరియు తెల్లదోమ ఆశించగా సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సంప్రదించగా లీటరు నీటిలో 4 మి.లీ.ల ఇమిడాక్లోప్రిడ్ కలిపి పిచికారి చేయమన్నారు. ఆ విధంగా చేశాక 5 రోజులలోనే ఫలితం కనిపించింది. సమాచార కేంద్రానికి నా ధన్యవాదాలు.

జె. రసూల్
8341846700
చేపాడు గ్రా,
చేపాడు మం,
వై.ఎస్.ఆర్. కడప జిల్లా

ఎం. వెంకట సుధాకర్
8106829551
జమ్మలదిన్నె గ్రా,
వాయల్పాడు మం,
కర్నూలు జిల్లా

నా దానిమ్మ తోటలో ఆకుమచ్చ తెగులు సోకింది. వెంటనే సమీకృత సమాచార కేంద్రాన్ని సంప్రదించగా 10 లీ. నీటిలో 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ సి.ఓ.సి. 30 గ్రా. కలిపి పిచికారి చేయమన్నారు. ఆవిధంగా చేయగా వారం రోజులలోనే తెగులు అదుపులోకి వచ్చింది. కేంద్రం సలహా నాకు ప్రయోజనమిచ్చింది.

నా బత్తాయి తోటలో చెట్టుకు కాయలు రాలిపోతున్నాయని సమీకృత సమాచార కేంద్రానికి తెలియపరచగా లీటరు నీటిలో 1 మి.లీ. ప్లానోఫిక్స్ కలిపి చల్లమన్నారు. ఈ మందు చల్లాక 5 రోజులలో మార్పు కనిపించింది. కేంద్రం సలహా నాకు బాగా పనికివచ్చింది.

ఎం. సుబ్బారావు
8688963992
బొబ్బర్లంక గ్రా
ఆత్రేయపురం మం,
తూ.గో. జిల్లా

పి. రమేష్‌బాబు
8184866683
ఓబులపాలెం గ్రా,
నాగులుప్పలపాడు
మం, ప్రకాశం జిల్లా

నేను పండిస్తున్న బీర తోటలో లద్దె పురుగు ఆశించగా కేంద్రాన్ని సంప్రదించగా వారిచ్చిన సలహా మేరకు ఒక ఎకరాకు 80 గ్రా. ఎమామెక్టిన్ బెంజోయేట్ స్ప్రే చేయగా ఒక వారం కాల వ్యవధిలో పురుగు ఉధృతి తగ్గింది. తద్వారా రైతు సమాచార కేంద్రానికి నా కృతజ్ఞతలు

నా మామిడి తోటలో కాయతొలుచు పురుగు ఆశించిందని గమనించి సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సంప్రదించగా ఎకరానికి 500 ఎం.ఎల్. క్లోరిపైరిఫాస్ పిచికారి చేయమని సలహా యిచ్చారు. 5 రోజులలో పురుగు ఉధృతి తగ్గింది. కేంద్రానికి నా ధన్యవాదాలు.

ఎస్.సూర్యనారాయణరెడ్డి
9391709990
చాపట్ల గ్రా,
రాప్తాడు మం,
అనంతపురంజిల్లా

గోపి
8008444727
గరివిడి గ్రా,
గరివిడి మం,
విజయనగరం జిల్లా

నేను వేసిన మునగ తోటలో ఆకుతొలుచు పురుగు ఆశించగా ఒక లీటరుకు 400 ఎం.ఎల్. క్వినాల్‌ఫాస్ స్ప్రే చేయగా పురుగు ఉధృతి తగ్గడం జరిగింది. తగిన సలహా ఇచ్చిన సమీకృత రైతు సమాచార కేంద్రానికి నా కృతజ్ఞతలు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



# ఉత్తమ సేవలందిస్తున్న ఆర్‌బికె సిబ్బంది



**ఎ. శ్రీనివాసరావు**
జి. అగ్రహారం, మాడుగుల మం.,
విశాఖపట్నం జిల్లా



**జి. శ్రీనివాసరావు**
కుమరాం గ్రా., గరివిడి మం.,
విజయనగరం జిల్లా



**హెచ్. తస్లీమ్**
చిన్నాయత్ గ్రా., హొళగుంద మం.,
కర్నూల్ జిల్లా



**కె. రామ్‌ప్రతాప్ నాయక్**
గడికోట గ్రా., గిద్దలూరు మం.,
ప్రకాశం జిల్లా



**ఎ. బాలాజీ**
రుద్రవరం గ్రా., మచిలీపట్నం మం.,
కృష్ణా జిల్లా



**కె. అనిత**
చందకచర్ల గ్రా., మడకశిర మం.,
అనంతపురం జిల్లా



**యం. సునీత**
రణస్థలం-1, రణస్థలం మం.,
శ్రీకాకుళం జిల్లా



**పి. కుసుమాకర్**
పట్టెంపాలెం గ్రా., తాడేపల్లి గూడెం మం.,
పశ్చిమగోదావరి జల్లా



**ప్రశాంత్ కుమార్**
కరప గ్రా., కరప మం.,
తూర్పుగోదావరి జిల్లా



**వి. లక్ష్మణ్ నాయక్**
గణపవరం-2, నాదెండ్ల మం.,
గుంటూరు జిల్లా



**షేక్ నదీమ్**
మాధవవరం గ్రా, యాదమర్రి మం.,
చిత్తూరు జిల్లా



**పి. రామలక్ష్మి**
సౌత్ మోపూరు గ్రా., నెల్లూరు మం.
నెల్లూరు జిల్లా



**డి. కీర్తన**
యర్రబల్లి-2, పులివెందుల మం.,
కడప జిల్లా



శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి,
గౌరవ ముఖ్యమంత్రి వర్యులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



ఇది రైతు ప్రభుత్వం



శ్రీ కె.కన్నబాబు,
రాష్ట్ర వ్యవసాయ, సహకార,
మార్కెటింగ్ మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు

## రైతు భరోసా

# సమీకృత రైతు సమాచార కేంద్రము

## టోల్ ఫ్రీ నెంబర్ ICC 155251 155251

### రైతు సోదరులకు విజ్ఞప్తి

మీ చీడ పీడల సమస్యల పై ఫోటోలను ఈ క్రింది వాట్సప్ నెంబర్లకు చేరవేసి
మీ వివరాలతో కూడిన సంక్షిప్త సమాచారాన్ని పంపండి తగిన సలహాలు సూచనలను పొందండి

**83310 56028** **83310 56149**
**83310 56150** **83310 56152**
**83310 56153** **83310 56154**

నోడల్ అధికారి, సమీకృత రైతు సమాచార కేంద్రం, గన్నవరం

